# వేకువ సమయం

సంపుటి: 14 సంచిక: 172

VEKUVA SAMAYAM TELUGU DAILY

⋆ Mahabubnagar ⋆ Hyderabad ⋆ Miryalaguda & Rangareddy | సంపాదకులు : కె.భాస్కర్‌రావు | రూ.2.00/- పేజీలు 8 | తేది: శనివారం 18 జూలై 2026








**సమయం ప్రతినిధి:** రైల్వే ప్రయాణికుల ఆత్మగౌరవం, భద్రత, ప్రమాద పరిహారానికి సంబంధించి సుప్రీంకోర్టు కీలకమైన వ్యాఖ్యలు చేసింది. ఇకపై ప్రయాణికులను 'రెండవ తరగతి ప్రయాణికులు' అని సంబోధించవద్దని రైల్వే శాఖను ఆక్షేపించింది. 'క్లాస్' అనే విభజన కేవలం రైలు కోచ్‌లకు మాత్రమే పరిమితం కావాలని, మనుషులకు కాదని జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ ఎన్. కోటీశ్వర్ సింగ్‌లతో కూడిన ధర్మాసనం స్పష్టం చేసింది. ప్రయాణికులను అలా పిలవడం రాజ్యాంగం కల్పించిన సమానత్వ స్ఫూర్తికి విరుద్ధమని, ఇది గత చరిత్రలోని వర్గ విభజనలను గుర్తు చేస్తోందని ధర్మాసనం తీవ్రంగా ఆక్షేపించింది.

**టికెట్ లేదని నిరూపించాల్సిన బాధ్యత రైల్వేదే..**

ఒక రైలు ప్రమాద బాధితురాలికి రూ. 8 లక్షల పరిహారం చెల్లించాలని ఆదేశించిన కోర్టు.. ప్రమాద సమయంలో టికెట్ పోయినంత మాత్రాన పరిహారాన్ని నిరాకరించడానికి వీల్లేదని తేల్చి చెప్పింది. బాధిత కుటుంబాలు అఫిడవిట్ ఇస్తే సరిపోతుందని, సదరు ప్రయాణికుడికి టికెట్ లేదని నిరూపించాల్సిన బాధ్యత పూర్తిగా రైల్వే శాఖదేనని స్పష్టం చేసింది. రైల్వే ప్రమాద పరిహార చట్టాలను మానవతా దృక్పథంతో, ఉదారంగా అమలు చేయాలని ధర్మాసనం హితవు పలికింది. భద్రతా నిబంధనలు కాగితాల్లో బాగున్నా.. క్షేత్రస్థాయిలో అమలు లోపించిందని అసంతృప్తి వ్యక్తం చేసింది.




**సమయం ప్రతినిధి :** భూరికార్డులు పౌరసత్వానికి కచ్చితమైన రుజువులు కావని కలకత్తా హైకోర్టు తాజాగా పేర్కొంది. విదేశీయులు కూడా భారత్‌లో భూమి కొనుగోలు చేయొచ్చన్న విషయాన్ని ప్రస్తావించింది. భారత్‌లో భూమి కొన్నంత మాత్రాన పౌరులు అయిపోరని పేర్కొంది. బంగ్లాదేశ్ నుంచి భారత్‌లోకి అక్రమంగా చొరబడ్డాడన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న నసీర్ ముల్లా అనే వ్యక్తి కేసులో విచారణ సందర్భంగా న్యాయస్థానం ఈ వ్యాఖ్యలు చేసింది. నసీర్ ముల్లా తరఫు న్యాయవాది తన వాదనలు వినిపిస్తూ నసీర్ భారత పౌరుడేనని అన్నారు. కేంద్రం మాత్రం ఈ వాదనలను కొట్టి పారేసింది. తాను విదేశీయుడినని నసీర్ స్వయంగా ఒప్పుకున్నాడని తెలిపింది. ఈ నేపథ్యంలో తన పౌరసత్వాన్ని రుజువు చేసుకునేందుకు డాక్యుమెంట్లు చూపాలని న్యాయస్థానం ఆదేశించింది. దీంతో, నసీర్‌కు చెందిన భూరికార్డులను మాత్రమే అతడి తరఫు లాయర్ సమర్పించారు. దీనిపై కోర్టు స్పందిస్తూ భూరికార్డులు పౌరసత్వానికి రుజువులు కావని స్పష్టం చేసింది. ఇతర డాక్యుమెంట్స్‌ను సమర్పించేందుకు జులై 20 వరకూ గడువు ఇచ్చింది. గత నెలలో పశ్చిమ బెంగాల్‌లో నసీర్‌ను అధికారులు అదుపులోకి తీసుకున్నారు. ప్రస్తుతం అతడిని డిటెన్షన్ సెంటర్‌లో పెట్టారు. భారత పాస్‌పోర్టులు దేశ పౌరసత్వానికి రుజువు కాదని కేంద్రం గత నెలలోనే పేర్కొన్న విషయం తెలిసిందే. వీటిని విదేశీయులకూ ఇచ్చే అవకాశం సాంకేతికంగా ఉండటంతో పౌరసత్వానికి రుజువుగా పరిగణించలేమని ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి.




**న్యూఢిల్లీ, సమయం ప్రతినిధి:** దేశంలో త్వరలో జరగబోయే పార్లమెంట్ నియోజకవర్గాల పునర్విభజనకు సంబంధించిన బిల్లుపై తమిళనాడు ప్రధాన ప్రతిపక్షం డీఎంకే అత్యంత కీలకమైన, స్వతంత్ర నిర్ణయం తీసుకుంది. జాతీయ స్థాయిలో కాంగ్రెస్ సారథ్యంలోని ఇండియా కూటమితో సంబంధం లేకుండా ... రాష్ట్ర ప్రయోజనాలు, దక్షిణాది హక్కుల విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని స్పష్టం చేసింది. ఈ బిల్లుపై కాంగ్రెస్‌తో ఎలాంటి ముందస్తు సంప్రదింపులు జరపకుండానే, సొంతంగా నిర్ణయం తీసుకుని పార్లమెంట్‌లో గళమెత్తాలని డీఎంకే అధినాయకత్వం నిర్ణయించింది. ప్రస్తుతం లండన్ పర్యటనలో ఉన్న డీఎంకే అధినేత ఎం.కె.స్టాలిన్ అక్కడి నుంచే వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పార్టీ ఎంపీలతో అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ భేటీలో లోక్‌సభ స్థానాల పునర్విభజన వల్ల తమిళనాడుతో పాటు దక్షిణాది రాష్ట్రాలకు జరిగే నష్టంపై సుదీర్ఘంగా చర్చించారు. 'తమిళనాడు ప్రజల గొంతుకగా పార్లమెంట్‌లో మన ఎంపీలు గళం విప్పాలి. రాష్ట్ర హక్కులను, ప్రజల ప్రయోజనాలను కాపాడటమే మన ఏకైక లక్ష్యం' అని ఎం.కె.స్టాలిన్ చెప్పారు. సాధారణంగా జాతీయ స్థాయి ముసాయిదాలు, బిల్లుల విషయంలో డీఎంకే.. కొంతకాలంగా కాంగ్రెస్ పార్టీతో కలిసి ఉమ్మడి వ్యూహాన్ని అనుసరిస్తూ వచ్చింది. అయితే, ఇటీవలి రాజకీయ పరిణామాలు, డీఎంకే ఒంటరిగా పోరాడడానికే మొగ్గు చూపేలా చేశాయి.

## ముగిసిన క్యాబినెట్ సమావేశం..
# ధరణిపై సిట్ వేయాలని నిర్ణయం..



**సమయం ప్రతినిధి :** తెలంగాణ సచి వాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన ప్రారంభమైన మంత్రివర్గ సమావేశం ముగిసింది. దాదాపు మూడు గంటల పాటు సాగిన ఈ సమావేశంలో పలు అంశాలపై మంత్రులు చర్చించి కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ధరణి, నీటిపారుదల ప్రాజెక్టులు, బుల్లెట్ ట్రైన్, డిగ్రీ కళాశాలల్లో పోస్టుల భర్తీ, ఇందిరమ్మ ఇళ్లు, గ్రామ పంచాయతీల ఆదాయం వంటి అంశాలు ప్రధానం గా చర్చకు వచ్చాయి.

**క్యాబినెట్ కీలక నిర్ణయాలు..** ఈ సమావేశంలో దేవాదుల, చిన్న కాళేశ్వరం, పాలమూరు-రంగారెడ్డి, సీతారామ ప్రాజెక్టుల అంచనా వ్యయాలను పెంచాలని క్యాబినెట్ నిర్ణయించింది. అలాగే జగిత్యాల జిల్లాలోని డిగ్రీ కళాశాలలో పలు పోస్టుల భర్తీకి క్యాబినెట్ ఆమోదం తెలిపింది. సంగారెడ్డి జిల్లా పఠాన్‌చెరులో ఇందిరమ్మ ఇళ్ల కోసం భూమి కేటాయింపునకు క్యాబినెట్ పచ్చజెండా ఊపింది. బుల్లెట్ ట్రైన్ అలైన్‌మెంట్ మార్పునూ మంత్రివర్గం ఆమోదించింది. తెలంగాణ పంచాయతీ రాజ్-2018 చట్ట సవరణకు క్యాబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. గ్రామ పంచాయతీల సొంత ఆదాయం ట్రెజరీలో కాకుండా ఇకపై నేరుగా జీపీ బ్యాంకు ఖాతాలోనే జమయ్యేలా 70(3) సెక్షన్ సవరణకు పచ్చజెండా ఊపింది. ఈ మేరకు త్వరలో ఆర్డినెన్స్ జారీ చేసే అవకాశం ఉంది.




**తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జి మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్ తిరస్కరణ ఉదంతం జాతీయ రాజకీయాల్లో తీవ్ర దుమారం రేపుతున్న వేళ.. కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ (CEC) జ్ఞానేష్ కుమార్ ఈ వివాదంపై కీలక వ్యాఖ్యలు చేశారు.**

**సమయం ప్రతినిధి :** ఎన్నికల నిబంధనల అమలు, అఫిడవిట్ల దాఖలు విషయంలో కమిషన్ ఎంత కఠినంగా ఉంటుందో ఆయన స్పష్టం చేశారు. మీడియా ప్రతినిధులతో జరిగిన ఒక ప్రత్యేక చిట్-చాట్‌లో ఆయన ఈ వ్యవహారంపై తెరవెనుక ఉన్న అసలు వాస్తవాలను వెల్లడించారు.

**నిబంధనలు అందరికీ ఒకటే.. ప్రతీ కాలమ్ భర్తీ చేయాల్సిందే :** నామినేషన్ పత్రాలను నింపే విషయంలో అభ్యర్థులు కచ్చితంగా పూర్తి నిబంధనలు పాటించాల్సిందేనని సీఈసీ తేల్చి చెప్పారు. 'నామినేషన్ ఫామ్‌లో అడిగిన ప్రతీ ఒక్క కాలమ్‌ను (Column) అభ్యర్థులు తప్పనిసరిగా భర్తీ చేయాలి. చట్టసభలకు పోటీ చేసేటప్పుడు ఏ చిన్న సమాచారాన్ని దాచినా అది నామినేషన్ చెల్లుబాటునే ప్రమాదంలో పడేస్తుంది' అని జ్ఞానేష్ కుమార్ చెప్పారు.

## 247 నర్సింగ్ ఆఫీసర్లకు నియామక పత్రాలు అందజేసిన ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క



**మేడ్చల్ మల్కాజిగిరి, సమయం ప్రతినిధి (జులై 17):** ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీసెస్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో తాజాగా ఎంపికైన 247 మంది నర్సింగ్ ఆఫీసర్లకు సేవాలాల్ భవన్‌లో నియామక పత్రాలను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అందజేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ, వైద్యం మరియు విద్య రంగాలపై ప్రభుత్వం చేస్తున్న ఖర్చు కేవలం ఉచిత సంక్షేమం కాదని, రాష్ట్ర భవిష్యత్తును బలోపేతం చేసే మానవ వనరులపై దీర్ఘ కాలిక పెట్టుబడి అని వివరించారు. ఆరోగ్యవంతమైన, విద్యా వంతమైన సమాజమే బలమైన ఆర్థిక వ్యవస్థకు పునాది అని అన్నారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పారదర్శక విధా నాలతో రికార్డు స్థాయిలో 76 వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసి యువతకు విస్తృత ఉపాధి అవకాశాలు కల్పించామని భట్టి విక్రమార్క తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులు, మెడికల్ కాలేజీలు, నర్సింగ్ కాలేజీలు, పారా మెడికల్ విద్యా సంస్థలను విస్తరిస్తూ వైద్య రంగాన్ని మరింత బలపరుస్తున్నామని చెప్పారు. ఈఎస్ఐ ఆసుపత్రులను అత్యాధునిక వైద్య సదుపాయాలతో అభివృద్ధి చేసి, కార్మికులు మరియు వారి కుటుంబాలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. నూతనంగా నియామకం పొందిన నర్సింగ్ ఆఫీసర్లను అభినందిస్తూ, సేవా భావనతో ప్రజలకు ఉత్తమమైన వైద్య సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి, ఇతర ప్రజా ప్రతినిధులు మరియు అధికారులు పాల్గొన్నారు.

## కేంద్ర నిధుల దుర్వినియోగం మానాలి.. లేదంటే నిధులు ఆగిపోతాయి

**మేడ్చల్ మల్కాజిగిరి, సమయం ప్రతినిధి (జులై 17):** కేంద్ర ప్రభుత్వం ఏ పథకం కోసం నిధులు ఇస్తే ఆ పథకం కోసం మాత్రమే వాడాలని, లేని పక్షంలో నిధులు ఆగిపోయే పరిస్థితి ఏర్పడుతుందని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి, కరీంనగర్ పార్లమెంటు సభ్యుడు బండి సంజయ్ కుమార్ మండిపడ్డారు. జిల్లా కేంద్రంలోని కార్గిల్ లేక్ అభివృద్ధి కోసం ఏర్పాటు చేసిన ఒక్క కోటి 32 లక్షల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన అనంతరం బండి సంజయ్ మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన కేంద్ర ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం (ఫిఫ్టీంత్ ఫైనాన్స్ కమిషన్) ద్వారా రాష్ట్రాలకు కేటాయించిన నిధులను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం దుర్వినియోగం చేస్తోందని ఆరోపించారు. 15వ ఆర్థిక సంఘం నిధులు గ్రామ పంచాయతీల పరిధిలోని గ్రామాల అభివృద్ధి కోసం మాత్రమే కేటాయించినవని, వాటిని ఆ పనుల కోసం మాత్రమే వినియోగించాలని బండి సంజయ్ డిమాండ్ చేశారు. ఈ ప్రభుత్వంతో పాటు గత ప్రభుత్వం కూడా నిధులను దుర్వినియోగం చేసి తప్పుడు నివేదికలు సమర్పిస్తోందని ఆరోపించారు.



కేంద్ర ప్రభుత్వం అమృత్ పథకం ద్వారా వేల కోట్ల రూపాయలు రాష్ట్ర ప్రభుత్వాలకు కేటాయిస్తోందని, నిధుల కేటాయింపు విషయంలో అధికారులు కీలక బాధ్యత వహించాలని సూచించారు.




# సంపాదకీయం

## సీఎస్‌డీఎస్ భవిష్యత్తేమిటి?

ఉన్నత విద్యా సంస్థలకు వ్యతిరేకంగా కూడా బుల్డోజర్ న్యాయం అమలవుతోంది! న్యూఢిల్లీలోని 'అభివృద్ధి చెందుతున్న సమాజాల అధ్యయన కేంద్రం' (సెంటర్ ఫర్ ది స్టడీ ఆఫ్ డెవెలపింగ్ సొసైటీస్–సీఎస్‌డీఎస్)కు ప్రభుత్వ ఆర్థిక సహాయంలో భారీ కోత విధించేందుకు ప్రభుత్వం పూనుకున్నట్టు ఈ నెల 10న వార్తలు వెలువడ్డాయి. సీఎస్‌డీఎస్ ఉనికిని రూపుమాపేందుకే ఆర్థిక సహాయం నిలిపివేతకు ప్రభుత్వం పూనుకున్నదనడంలో సందేహం లేదు. బుల్డోజర్ న్యాయంలో వలే ఇక్కడ కూడా చట్ట నియమాలను తలకిందులు చేయడం జరిగింది. నేర న్యాయ నిర్ణయం (క్రిమినల్ జస్టిస్) ఒక నిర్దిష్ట క్రమంలో ఉంటుంది: ఒక నేరం సంభవిస్తుంది; దానికి రుజువులు లభిస్తాయి; అవి సంశయాత్మకంగా ఉంటాయి; సంశయాలు విచారణకు దారి తీస్తాయి; విచారణ నేర నిర్ధారణకు, శిక్షకు దోహదం చేస్తుంది. సీఎస్‌డీఎస్ విషయంలో ఈ ప్రక్రియ ముందుగానే గుర్తించిన అపరాధిపై బహిరంగంగా నేరారోపణతో ప్రారంభమయింది. న్యాయ సమర్థనకు అవసరమైన సాకులు సృష్టించారు. శిక్షను ఇంకా అమలుపరచకపోయినా ముందుగానే నిర్ణయమయింది. సామాజిక శాస్త్రాల అధ్యయనం, పరిశోధనలతో సంబంధమున్న సంస్థలు, వ్యక్తులు అందరికీ హెచ్చరికగా ఉండేలా ఆ శిక్ష విస్తృత ప్రభావశీలంగా ఉంటుంది. భారతీయ వైజ్ఞానిక శాస్త్రాలకు ముంబైలోని టాటా ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్ (టీఐఎఫ్ఆర్), బెంగళూరులోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్ (ఐఐఎస్‌సీ) ఎలాంటివో భారతీయ సామాజిక శాస్త్రాలకు సీఎస్‌డీఎస్ అలాంటిది. దేశంలోను, విశాల ప్రపంచంలోను అగ్రశ్రేణి మేధావిగా సుప్రసిద్ధుడైన రజనీ కొఠారి 1963లో స్థాపించిన ఈ ఉన్నత విద్యాసంస్థలో స్వతంత్ర భారతదేశ మొదటి రెండు తరాల విఖ్యాత సామాజిక శాస్త్రవేత్తలు ఎందరో అధ్యాపకులుగా ఉన్నారు. ఆర్థికవేత్తలు, ప్రస్తుత అధ్యాపకులను మినహాయిస్తే ఆ ప్రముఖుల జాబితాలో అశీస్ నంది, డి.ఎల్ శేథ్, రామాశ్రయ్ రాయ్, గోపాల్ కృష్ణ, బషీరుద్దీన్ అహ్మద్, గిరి దేశింగ్‌కార్, సుధీర్ కాకర్, శివ్ విశ్వనాథన్, హర్ష్ సేథీ, సురేశ్ శర్మ, డి.ఆర్ నాగరాజ్, వి.బి సింగ్, రాజీవ్ భార్గవ, షయిల్ మాయారామ్, ఆదిత్య నిగమ్, అభయ్ దూబె తదితర మేధా దిగ్గజాలు ఉన్నారు. ఇంకా సుఖ్మోయ్ చక్రవర్తి, టి.ఎన్ మదన్, దీపక్ నయ్యర్, జేపీఎస్ ఓబరాయ్, మనోరంజన్ మొహంతి, పాట్రిషియా ఓబరాయ్, సుహాస్ పల్సీకర్ మొదలైన పండిత ప్రకాండులు కూడా సీఎస్‌డీఎస్ విస్తృత విద్యా కుటుంబంలోని వారే. రాజకీయాలు, సమాజం, సంస్కృతిపై మనదేశంలోను, ప్రపంచవ్యాప్తంగాను మేధా చర్చలలో సీఎస్‌డీఎస్ ఎందుకు ఒక ముఖ్య కేంద్రంగా ఉన్నదో ప్రస్తావిత అధ్యాపకుల జాబితా విశదం చేస్తుంది.

ప్రచ్ఛన్నయుద్ధ కాల సైద్ధాంతిక సమరంలో సీఎస్‌డీఎస్ ఒక మార్క్సిస్టేతర ఆలోచనా స్రవంతికి పేరుపొందింది. మార్క్సిస్టు భావజాలాన్ని అదెప్పుడూ వ్యతిరేకించలేదు. సామాజిక శాస్త్రాలను వలసవాద ఆలోచనలు, ప్రభావాల నుంచి విముక్తం చేసే అజెండా సీఎస్‌డీఎస్ మేధా ప్రస్థానంలో ఒక ముఖ్య భాగం. భారతీయ భాషలలో సామాజిక శాస్త్రాల అధ్యయనానికి పథ నిర్దేశం చేసింది కూడా సీఎస్‌డీఎస్ కావడం విశేషం. 1970 దశకంలో ఇందిర విధించిన ఎమర్జెన్సీని సీఎస్‌డీఎస్ తీవ్రంగా ప్రతిఘటించింది. అయితే 2014 నుంచి మారిన రాజకీయ పరిస్థితులలో ఈ సంస్థ ఉద్దేశపూర్వకంగానే తన రాజకీయ కార్యకలాపాలను తగ్గించుకున్నది. సీఎస్‌డీఎస్‌ను బుల్డోజర్ దాడికి ఎందుకు ఎంపిక చేసుకున్నారో అర్థం చేసుకోవడం కష్టం. భారత ప్రజాస్వామ్య రాజకీయాలు, ఓటింగ్ ప్రవర్తనను అధ్యయనం చేసేందుకు 1997లో సీఎస్‌డీఎస్ ప్రారంభించిన లోక్‌నీతి కార్యక్రమమే ప్రధాన కారణమని నేను భావిస్తున్నాను. సర్వేల నిర్వహణలో ప్రామాణిక పద్ధతులకు, సమాచార నివేదనలో పారదర్శకతకు ఎటువంటి మినహాయింపులు లేకుండా నిబద్ధమై ఉన్న ఆ పరిశోధనా కార్యక్రమం గత మూడు దశాబ్దాలుగా దేశ పరిపాలనపై ప్రజాభిప్రాయాన్ని తెలుసుకునేందుకు విశ్వసనీయమైన ఆధారంగా ఉన్నది. పాలకుల వ్యక్తిగత అభిప్రాయాలు, ఆకాంక్షలకు అనుగుణంగా ఆ పరిశోధనా పద్ధతులను మార్చడం ఎట్టి పరిస్థితులలోను జరగదు. నిరంకుశ ప్రభుత్వాలు ఇటువంటి పరిశోధనలను హర్షించవు. ప్రజల్లో అశాంతి పెచ్చరిల్లుతున్న పరిస్థితులలో ఎన్నికల్లో అక్రమాలు చోటుచేసుకుంటున్నాయన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నప్పుడు లోక్‌నీతి సర్వేలను పాలకులు సహిస్తారా? గతంలో సెంటర్ ఫర్ పాలసీ రీసెర్చ్‌ను తీవ్ర ఆంక్షలకు గురి చేసినట్టుగానే ప్రపంచవ్యాప్తంగా సామాజిక శాస్త్ర జగత్తులో పేరు ప్రతిష్ఠలు ఉన్న సీఎస్‌డీఎస్‌ను కూడా పూర్తిగా కట్టడి చేస్తే విద్యావేత్తలు, మేధావులకు ఒక గట్టి సందేశాన్ని పంపవచ్చని పాలకులు భావించి ఉంటారు. సీపీఆర్, సీఎస్‌డీఎస్‌ను లక్ష్యంగా చేసుకున్నప్పుడు ప్రభుత్వ విధానాలను వ్యతిరేకించేవారికి ఎటువంటి భద్రత ఉండబోదు అన్నదే ఆ సందేశం. సీఎస్‌డీఎస్‌ను లక్ష్యంగా చేసుకున్నారు. దానిపై చర్యకు ఒక కారణాన్ని కనుగొనాలి. హాస్యాస్పదమైన అల్ప కారణమొకటి లభించింది. మహారాష్ట్రలో నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాల ఓటర్ల సంఖ్యలో హెచ్చు తగ్గులు అసాధారణంగా ఉన్నాయంటూ సంబంధిత గణాంకాలను ప్రొఫెసర్ సంజయ్ కుమార్ ఆగస్టు 17, 2025న సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ఓటర్ల సంఖ్య పెరుగుదల, తగ్గుదలను గణించడంలో తప్పులు జరిగాయి. ఇది గ్రహించిన ప్రొఫెసర్ సంజయ్ 48 గంటలలోనే జరిగిన తప్పుకు క్షమాపణ చెప్పి, సోషల్ మీడియా నుంచి ఆ గణాంకాల పోస్ట్‌ను తొలగించారు వాటి గురించి ఆయన ఎటువంటి రాజకీయ వ్యాఖ్యలు, వ్యంగ్య విమర్శలు చేయలేదు. చాలా సౌమ్య రీతిలో ఆ సమాచారాన్ని వెల్లడించారు. అప్పటికే 'ఓట్ చోరీ'పై ప్రతిపక్షం చేస్తున్న ప్రచారాన్ని సమర్థించేదిగా ఆ సమాచారం లేదు. ఒక పరిశోధనా కార్యక్రమ సమాచారాన్ని సంస్థాగతంగా వెల్లడించడం కూడా కాదది. ఏది ఏమైనా ఆ గణాంకాలలో తప్పు దొర్లిన మాట వాస్తవం. అయితే అది ఏమంత ప్రాధాన్యమున్నది కాదు. తప్పును గ్రహించిన వెంటనే దాన్ని సరిదిద్దుకోవడం జరిగిందన్నది గమనార్హం. సీఎస్‌డీఎస్‌పై చర్యకు మరో కారణం కూడా అధికార వర్గాలకు లభించింది. ఇదీ ఏమంత ప్రాధాన్యమున్న సమస్య కానేకాదు. ఓటర్ జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ(సర్) ప్రక్రియ అమలుపై నిర్వహించిన ఒక ఒపీనియన్ పోల్ ఫలితాలను సీఎస్‌డీఎస్ ఇటీవల వెల్లడించింది. ఎన్నికల సంఘం నిష్పాక్షికతపై ప్రజల విశ్వాసం గణనీయంగా తగ్గిందన్నది ఆ సర్వే ఫలితాల సారాంశం. ఈ ఒపీనియన్ పోల్ వెల్లడించిన విషయాలలో విస్మయం కలిగించేవి ఏవీ లేవు. అయితే బీజేపీ శ్రేణులు ప్రొఫెసర్ సంజయ్ సోషల్ మీడియా పోస్ట్‌ను, ఈ ఒపీనియన్ పోల్ ఫలితాలను తెలివిగా కలగలిపి సీఎస్‌డీఎస్‌పై విమర్శలకు ఉపక్రమించాయి. ఆ పార్టీ ట్రోల్ ఆర్మీ రంగంలోకి దిగింది. అలాగే విధేయ మీడియా కూడా. సీఎస్‌డీఎస్‌కు గుణపాఠం చెప్పాలని ముక్తకంఠంతో డిమాండ్ చేశాయి. ట్రోల్ ఆర్మీ విమర్శలు వెల్లువెత్తిన వెన్వెంటనే అధికారిక నేరారోపణ జరిగింది. సీఎస్‌డీఎస్ లాంటి సామాజిక శాస్త్ర పరిశోధనా సంస్థలు అన్నిటికీ ఆర్థిక సహాయమందించే భారతీయ సామాజిక శాస్త్ర పరిశోధనా మండలి (ఐసీఎస్ఎస్ఆర్) రంగంలోకి దిగింది. 'సీఎస్‌డీఎస్ తన పరిశోధనా కార్యక్రమాల సమాచారాన్ని తారుమారు చేస్తున్నట్టు తమ దృష్టికి వచ్చిందని, భారత ఎన్నికల సంఘం పవిత్రతకు కళంకం కలిగించే కథనాలను సృష్టించేందుకు ప్రయత్నిస్తోందని, ఇవి నిబంధనలను పూర్తిగా ఉల్లంఘించడమేనని ఐసీఎస్ఎస్ఆర్ సామాజిక మాధ్యమాలలో ఆరోపించింది. విచారణ ప్రారంభం కాక మునుపే తీర్పు వచ్చేసింది! బుల్డోజర్ న్యాయంలో వలే లక్ష్యం ఎంపికయింది. శిక్ష ఖరారయింది. అందుకు కారణాన్ని కూడా నిర్ణయించారు. ముందుగానే తీసుకున్న నిర్ణయం అమలుకు రంగాన్ని సిద్ధం చేసేందుకు ఐసీఎస్ఎస్ఆర్ ఒక కమిటీని నియమించింది.

## ఉన్నత విద్యలో గుర్తింపు ఆధారిత వివక్షకు శాశ్వత అంతం

## - రోహిత్ వేముల చట్టం తీసుకొస్తాం: భట్టి విక్రమార్క



**మేడ్చల్ మల్కాజిగిరి, వేకువ సమయం ప్రతినిధి (జులై 17):** ఉన్నత విద్యా సంస్థల్లో విద్యార్థుల గుర్తింపు ఆధారిత వివక్షను శాశ్వతంగా నిర్మూలించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. రోహిత్ వేముల తెలంగాణ (ఉన్నత విద్యలో గుర్తింపు ఆధారిత వివక్ష నివారణ) బిల్లు 2026 రూపకల్పనపై ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘం సమావేశం గురువారం సచివాలయంలో భట్టి విక్రమార్క అధ్యక్షతన జరిగింది. ఉపసంఘం సభ్యులైన మంత్రులు శ్రీధర్ బాబు, ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. సమావేశంలో మాట్లాడుతూ భట్టి విక్రమార్క మాట్లాడారు. "హైదరాబాద్ సెంట్రల్ విశ్వవిద్యాలయంలో జరిగిన రోహిత్ వేముల విషాద ఘటన దేశం మొత్తాన్ని కదిలించింది. భవిష్యత్తులో ఎటువంటి వివక్ష లేని విద్యా వ్యవస్థను, చట్టాన్ని తీసుకురావాలని కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీని నెరవేర్చడానికి రోహిత్ వేముల చట్టాన్ని ప్రభుత్వం తీసుకొస్తోంది" అని చెప్పారు. కొత్త చట్టానికి సంబంధించి సమగ్ర విధి-విధానాలతో కూడిన ప్రాథమిక ముసాయిదా నివేదికను త్వరగా సిద్ధం చేయాలని ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రజాభిప్రాయం సేకరించి, బిల్లును శాసనసభలో త్వరలోనే ప్రవేశపెట్టడం లక్ష్యం. భవిష్యత్తులో ఎలాంటి న్యాయపరమైన సమస్యలు రాకుండా చట్టాన్ని రూపొందించడానికి సుప్రీం కోర్టు అడ్వకేట్, సామాజిక కార్యకర్త దిశా వాడేకర్‌ను ప్రత్యేక ఆహ్వానితురాలిగా సమావేశానికి ఆహ్వానించి చర్చలు జరిపినట్లు ఉప ముఖ్యమంత్రి తెలిపారు.

## రిషి మెడికల్ అకాడమీకి నీట్‌లో ఘన విజయం

## 125 మెడికల్ సీట్లతో పాలమూరులో మరోసారి చరిత్ర సృష్టించిన రిషి




**మహబూబ్‌నగర్, జూలై 17 (సమయం ప్రతినిధి):** నీట్–2026 ఫలితాల్లో రిషి జూనియర్ కాలేజ్–మెడికల్ అండ్ ఐఐటీ అకాడమీ మరోసారి అద్భుత విజయాన్ని నమోదు చేసింది. పాలమూరు విద్యా చరిత్రలో ఒకే క్యాంపస్ నుంచి 125 మంది విద్యార్థులు మెడికల్ సీట్లు సాధించి రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు పొందింది. ఈ సందర్భంగా కళాశాల చైర్‌పర్సన్ శ్రీమతి చంద్రకళ, డైరెక్టర్ ఎస్. వెంకటయ్య మాట్లాడుతూ విద్యార్థుల కృషి, అధ్యాపకుల అంకితభావం, తల్లిదండ్రుల విశ్వాసం, సమర్థవంతమైన అకాడమిక్ ప్రణాళిక వల్లే ఈ విజయం సాధ్యమైందన్నారు. భవిష్యత్తులోనూ మరింత మంది విద్యార్థులను వైద్య విద్యలో ఉన్నత స్థానాలకు చేర్చే లక్ష్యంతో నాణ్యమైన విద్యను అందిస్తామని తెలిపారు. కళాశాల విద్యార్థుల్లో నుజత్ 555, మనస్విత 545, నందిని రెడ్డి 543, ప్రియాంక 540, భావన 529, సాయి శ్రీ 515, మలిహ కహానియా 511, హప్స మోహిన్ 511 మార్కులు సాధించి విశేష ప్రతిభ కనబరిచారని వెల్లడించారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను చైర్‌పర్సన్ చంద్రకళ, డైరెక్టర్ ఎస్. వెంకటయ్య అభినందించి, వారి ఉజ్వల భవిష్యత్తుకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల డీన్ భూపాల్ రెడ్డి, అకాడమిక్ డీన్ కళ్యాణ్ బాబు, ప్రిన్సిపల్ రాఘవేంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ ఐ ఆర్. ప్రక్రియలో జరిగిన సాంకేతిక సమస్యలను పరిష్కరించాలి - పంబాల పర్వతాలు

దేవరకొండ: జూలై 17 (సమయం ప్రతినిధి) : స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ ఐ ఆర్)–2026 కార్యక్రమంలో భాగంగా, దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ సూచనల మేరకు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వాంకునావత్ బిక్కు నాయక్ . నేరేడుగొమ్ము క్లస్టర్ కోఆర్డినేటర్ గిరి యాదయ్య పర్యవేక్షణలో నేరేడుగొమ్ము మండలం లితిమ్మాపురం గ్రామం (పోలింగ్ కేంద్రం నెం. 202)లిలో ఎన్యూమరేషన్ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేసిన అనంతరం, నేడు మండల తహసీల్దార్ (ఎం ఆర్ ఓ) శ్రీమతి ఉమాదేవి తో కాంగ్రెస్ పార్టీ .బి ఎల్ ఏ. పంబాల పర్వతాలు ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎన్యూమరేషన్ ఫారాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసే ప్రక్రియలో ఎదురైన సాంకేతిక సమస్యలు, కొన్ని చోట్ల నమోదైన వివరాల్లో జరిగిన పొరపాట్లు, ఓటర్ల వివరాల్లో తలెత్తిన వ్యత్యాసాలను .ఎం ఆర్ ఓ. దృష్టికి తీసుకువెళ్లారు. ఈ సమస్యల కారణంగా అర్హులైన ఓటర్లు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా, నమోదైన తప్పులను వెంటనే సరిదిద్దాలని, ప్రతి ఓటరి ఓటు హక్కు పరిరక్షించేలా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని పంబాల పర్వతాలు కోరారు. దీనిపై స్పందించిన (ఎం ఆర్ ఓ )ఉమాదేవి గారు, ఓటర్ల నుంచి వచ్చిన ప్రతి ఫిర్యాదును పరిశీలించి, సాంకేతిక లోపాలు మరియు నమోదులో జరిగిన పొరపాట్లను నిబంధనల ప్రకారం సవరించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ప్రతి అర్హుడైన ఓటరు పేరు సరైన



వివరాలతో ఓటరు జాబితాలో ఉండేలా అందరూ అప్రమత్తంగా ఉండాలని, ఏవైనా సమస్యలు ఉంటే వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని ఈ సందర్భంగా పంబాల పర్వతాలు ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## ఏనుగొండ ప్రభుత్వ పాఠశాలలో ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టర్ ఆకస్మిక తనిఖీ

### ఎఫ్ఎల్ఎన్ అమలుపై పరిశీలన.. ప్రధానోపాధ్యాయురాలికి సత్కారం



**మహబూబ్‌నగర్, జూలై 17 (సమయం ప్రతినిధి):** పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో అమలవుతున్న ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ (ఎఫ్ఎల్ఎన్) కార్యక్రమం అమలును పరిశీలించేందుకు ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టర్ రమేష్ శుక్రవారం మహబూబ్‌నగర్ జిల్లా అర్బన్ మండలంలోని ఏనుగొండ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారి విజయకుమారి, ఏఎంఓ దుంకుడు శ్రీనివాస్, ఎంఈఓ లక్ష్మణ్ సింగ్ పాల్గొన్నారు. పాఠశాలలో విద్యార్థుల చదవడం, రాయడం, గణిత నైపుణ్యాలు, తరగతి గది బోధన, అభ్యాస విధానాలను అధికారులు ప్రత్యక్షంగా పరిశీలించారు. విద్యార్థులు ఉత్సాహంగా, ఆత్మవిశ్వాసంతో తమ అభ్యాస ప్రతిభను ప్రదర్శించడంతో అధికారులు సంతృప్తి వ్యక్తం చేశారు. ఎఫ్ఎల్ఎన్ లక్ష్యాల సాధనలో విద్యార్థులను సమర్థవంతంగా తీర్చిదిద్దుతున్న ఉపాధ్యాయులను ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. అలాగే పాఠశాలలో నెలకొల్పిన పరిశుభ్రమైన, ఆహ్లాదకరమైన విద్యా వాతావరణాన్ని ప్రశంసిస్తూ ప్రధానోపాధ్యాయురాలు శ్రీమతి సూర్యలీలను శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా అధికారులు నాణ్యమైన బోధన, విద్యార్థి కేంద్రిత అభ్యాసం ద్వారా ఎఫ్ఎల్ఎన్ లక్ష్యాలను మరింత సమర్థవంతంగా అమలు చేసి ప్రతి విద్యార్థిలో ప్రాథమిక అక్షరాస్యత, సంఖ్యాజ్ఞాన నైపుణ్యాలను పెంపొందించేందుకు ఉపాధ్యాయులు నిరంతరం కృషి చేయాలని సూచించారు.

## భారతీయుల వల్లే బుల్లెట్ రైలు ప్రాజెక్టులో జాప్యం: జపాన్ మాజీ మంత్రి

మొదటి పేజీ తరువాయి

ముంబై–అహ్మదాబాద్ బుల్లెట్ ట్రెయిన్ ప్రాజెక్టు జాప్యానికి ఒక భారత మంత్రి, ఇతర అధికారులు కారణమని జపాన్ మాజీ మంత్రి హిడెకీ మకిహారా ఆరోపించారు. ఈ ప్రాజెక్టుపై ఒక జపాన్ ఇంజినీర్ స్థానిక వార్తాపత్రికలో వ్యక్తం చేసిన అభిప్రాయాలపై మంత్రి సోషల్ మీడియాలో స్పందించారు. ఈ ప్రాజెక్టు 2023లోనే ప్రారంభించడం అసాధ్యమని భారతీయ అధికారులకూ తెలుసునని ఆ ఇంజినీర్ పేపర్ లో రాసుకొచ్చారు. మొదట ప్రతిపాదించిన అంశాలతో పోలిస్తే ప్రాజెక్టు ప్రస్తుతం కొంత భిన్నంగా ఉందని అన్నారు. షిన్‌కాన్సెన్ సాంకేతికత ఆధారంగా ఈ ప్రాజటటక్టును ప్లాన్ చేసిన విషయం తెలిసిందే. ఈ కథనంపై మంత్రి హిడెకీ స్పందిస్తూ భారత అధికారులు చర్చల సందర్భంగా చాలా నిర్లక్ష్యంగా వ్యవహరించారని అన్నారు. ఇచ్చిన హామీలకు కట్టుబడి ఉండకుండా స్వీయ ప్రయోజనాలకే ప్రాధాన్యం ఇచ్చారని ఆరోపించారు. జపాన్ ప్రధాని భారత పర్యటన తరువాత కూడా ఎలాంటి ఫలితం లేకపోయిందని అన్నారు. బుల్లెట్ ట్రెయిన్ భద్రతకు కీలకమైన సిగ్నలింగ్ వ్యవస్థ జపాన్‌కు దక్కలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. షిన్‌కాన్సెన్ సాంకేతికత పూర్తిస్థాయిలో బుల్లెట్ రైలు కోసం వినియోగించకపోవడంపై జపాన్‌లో అసంతృప్తి ఉన్నట్టు తెలుస్తోంది. అయితే, రైలు నెట్వర్క్ నిర్వహణకు పూర్తిగా జపాన్‌పై ఆధారపడకుండా కొన్ని ఐరోపా వ్యవస్థలను కూడా భారత్ ఎంచుకున్నట్టు జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. అయితే, ఈ ప్రాజెక్టు విషయంలో చర్చలు సానుకూలంగా సాగుతున్నాయని ప్రభుత్వ వర్గాలను ఉటంకిస్తూ జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ఈ ప్రాజెక్టుకు సంబంధించి తొలి దశ వచ్చే ఏడాది ఆగస్టు 15న ప్రారంభం కానున్న విషయం తెలిసిందే. తొలి దశలో భారత్‌లో తయారైన హైస్పీడ్ రైళ్లతో కార్యకలాపాలు మొదలెట్టేందుకు ఇరు దేశాలు అంగీకరించినట్టు సమాచారం. 2030 నాటికల్లా ఈ10 బుల్లెట్ రైళ్లను సమకూర్చేందుకు జపాన్ అంగీకరించినట్టు తెలిసింది.

# ఎస్.సి., ఎస్.టి. ల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి







## రాష్ట్ర ఎస్.సి., ఎస్.టి. కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

**సమయం ప్రతినిధి//మంచిర్యాల జూలై 17, 2026 :** జిల్లాలో షెడ్యూల్డ్ కులములు, షెడ్యూల్డ్ తెగలకు చెందిన ప్రజల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారించడం జరుగుతుందని రాష్ట్ర ఎస్.సి., ఎస్.టి. కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. శుక్రవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, డి.సి.పి. ఎ.భాస్కర్, జిల్లా అటవీ అధికారి రాహుల్ కిషన్ జాదవ్, అదనపు కలెక్టర్లు పి.చంద్రయ్య, వి.రాములు, బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్, జిల్లా రెవెన్యూ అధికారి మోతిరామ్, కమిషన్ సభ్యులు రేణిగుంట్ల ప్రవీణ్, కుస్రం నీలాదేవి, రాంబాబు నాయక్, కొంకటి లక్ష్మీనారాయణ, జిల్ల శంకర్, మంచిర్యాల రాజస్వ మండల అధికారి శ్రీనివాస్ రావు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ విలాయత్ అలీ లతో కలిసి ఎస్.సి., ఎస్.టి. లకు సంక్షేమ పథకాల అమలు, అట్రాసిటీ కేసులు, భూ సమస్యలు, ఆశ్రమ పాఠశాలలు, ఆర్.ఓ.ఎఫ్.ఆర్. చట్టం, ఎస్.సి., ఎస్.టి. గ్రామాలలో మౌలిక వసతుల కల్పనపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కమిషన్ చైర్మన్ మాట్లాడుతూ షెడ్యూల్డ్ కులములు, షెడ్యూల్ తెగలవారికి రాజ్యాంగం కల్పించిన చట్టాలను పకడ్బందీగా అమలు చేస్తూ వారి సంక్షేమ, అభివృద్ధికి సమిష్టిగా కృషి చేయాలని తెలిపారు. జిల్లాలో 56 వేల 969 మంది షెడ్యూల్డ్ తెగలు, 1 లక్ష 99 వేల 493 మంది షెడ్యూల్డ్ కులముల వారు ఉన్నారని, రాజ్యాంగం కల్పించిన హక్కుల ప్రకారం సంక్షేమ పథకాలు వర్తించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలలో చదివే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, ఏకరూప దుస్తులు, దుప్పట్లు, బంకర్ బెడ్స్ సమకూర్చడం జరుగుతుందని, వసతి గృహాలు, గురుకులాలలో చదివే విద్యార్థులకు మెనూ ప్రకారం పోషక విలువలతో కూడిన భోజనం అందించడం జరుగుతుందని, సి.సి. కెమెరాలు ఏర్పాటు చేసి నిరంతరం పర్యవేక్షించడం జరుగుతుందని తెలిపారు. 2011 జనాభా లెక్కల ప్రకారం ఎస్.సి., ఎస్.టి. సబ్ ప్లాన్ క్రింద నిధుల కేటాయింపు జరుగుతుందని, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం లో జాబ్ కార్డ్ కలిగిన ప్రతి ఎస్.సి., ఎస్.టి. లకు పని కల్పించడం జరుగుతుందని తెలిపారు. ఎస్.సి., ఎస్.టి. స్వయం సహాయక సంఘాలకు బ్యాంకు లింకేజీ ద్వారా 20 లక్షల రుణ సదుపాయం కల్పించడం జరుగుతుందని, అంగన్వాడి, గ్రామపంచాయతీ, మహిళా సమాఖ్య భవనాల నిర్మాణం చేపట్టడం జరిగిందని తెలిపారు. మంచిర్యాల జిల్లాలో జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశాలు, పౌర హక్కుల దినోత్సవ కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించడం అభినందనీయమని, తద్వారా కేసులు తగ్గుముఖం పట్టడం సంతోషంగా ఉందని తెలిపారు. 1 వేయి కంటే ఎక్కువగా కేసులు నమోదు అయిన జిల్లాలలో ప్రత్యేక న్యాయస్థానం ఏర్పాటుకు ప్రతిపాదించడం జరిగిందని, మంచిర్యాల జిల్లాలో ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆర్.ఓ.ఎఫ్.ఆర్. చట్టం ప్రకారం గ్రామాలలో సభలు నిర్వహించి అర్హులైన గిరిజనులు, గిరిజనేతరులకు నిబంధనలకు లోబడి పట్టాలు జారీ చేసే విధంగా రెవెన్యూ, అటవీ, పోలీస్ శాఖల అధికారులు సమన్వయంతో సర్వే చేయాలని తెలిపారు. భూ సమస్యల పరిష్కారంలో రెవెన్యూ, పోలీస్ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, ప్రభుత్వ ఉద్యోగుల పదోన్నతిలో రోస్టర్ పద్ధతిని సమర్థవంతంగా అమలు చేయాలని తెలిపారు. జిల్లాలో బెల్ట్ షాపులపై ఆబ్కారీ మధ్య నిషేధ శాఖ ఆధ్వర్యంలో కఠిన చర్యలు చేపట్టాలని తెలిపారు. మున్సిపాలిటీలలో ఎస్.సి., ఎస్.టి. పొరుగు సేవల ఉద్యోగులు, సిబ్బందికి సకాలంలో వేతనాలు చెల్లించాలని, పి.ఎఫ్. అమలు, భీమా సౌకర్యాన్ని కల్పించాలని తెలిపారు. షెడ్యూల్డ్ కులములు, తెగల ప్రజలు నివసిస్తున్న గ్రామాలకు రహదారి సౌకర్యం, త్రాగునీటిని అందించాలని, అట్రాసిటీ కేసులను త్వరగా విచారించి నిందితులకు శిక్షపడేలా చర్యలు తీసుకోవాలని, అట్రాసిటీ బాధితులకు త్వరగా పరిహారం అందించాలని తెలిపారు. జిల్లాలో అవుట్ సోర్సింగ్ ఏజెన్సీలలో షెడ్యూల్డ్ కులములు, షెడ్యూల్డ్ తెగలను ప్రోత్సహించాలని, ఉపాధి కల్పనలో ప్రాధాన్యత కల్పించాలని తెలిపారు. జిల్లాలోని బెస్ట్ అవైల బుల్ పాఠశాలలలో ఎస్.సి., ఎస్.టి. విద్యార్థుల ప్రవేశాల దృష్ట్యా పాఠశాలలకు చెల్లించవలసిన బకాయిలు, కులాంతర వివాహాల ప్రోత్సాహకాలు, విదేశీ విద్య ఉపకార వేతనాలు, ఇతర రంగాలకు సంబంధించిన అవసరాలకు అనుగుణంగా ప్రతిపాదనలు సిద్ధం చేసి అందించాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ షెడ్యూల్డ్ తెగలు, కులముల వారి అభివృద్ధి, సంక్షేమానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశాలు క్రమం తప్పకుండా నిర్వహించడం జరుగుతుందని, అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్.సి., ఎస్.టి. విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు దమ్మ నారాయణ, చిలుక రాజనర్సు, దుర్గ మల్లయ్య, పెద్ది రాజన్న, పౌర సరఫరాల కమిటీ సభ్యులు జిల్లపల్లి వెంకటేష్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# నీట్-2026లో 'ప్రతిభ' సంచలనం

## 80కి పైగా మెడికల్ సీట్లతో విజయ దుందుభి.. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు యాజమాన్యం అభినందనలు




**మహబూబ్‌నగర్, జూలై 17 (సమయం ప్రతినిధి):** నీట్-2026 జాతీయ వైద్య ప్రవేశ పరీక్ష ఫలితాల్లో ప్రతిభ మెడికల్ అకాడమీ విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబర్చి సంచలన విజయాన్ని నమోదు చేశారు. 80కి పైగా మెడికల్ సీట్లు సాధిస్తూ అకాడమీ మరోసారి తన సత్తా చాటిందని కళాశాల యాజమాన్యం తెలిపింది. అకాడమిలో శిక్షణ పొందిన విద్యార్థుల్లో ఎం.డి. అశ్వక్ 602 మార్కులు సాధించి అగ్రస్థానంలో నిలవగా, ఎం. సామ్య 580, సయ్యద్ సమీరా నాజ్ 551, ఎన్. సాహితి 540, సి. తరుణ్ రెడ్డి 534, గాజుల మనీష్ 513, బి. శుభప్రద 496, ఎం.డి. ఉమేర్ 487, వి. మౌనిక 485, ఎం. సహస్ర 485, ఎన్. అరవింద్ 484, కె. ఆనంద్ 483, సాదియా ఫాతిమా 472, సి. భవ్య 470, మెహబూబియా ఈరమ్ 469, ఎం. సౌమ్య 469, వి. గౌతమ్ రాజ్ కుమార్ 467, సఫుర 467, వి. సాయిచైతన్య 463, భార్గవి 458, ఉమర్ ఫరూక్ 458, అయేషా సిద్దికా 454, పి. సరిత 452, కె. యశ్వంత్ 452 మార్కులు సాధించి విశేష ప్రతిభ కనబరిచారు. అదేవిధంగా 400కు పైగా మార్కులు సాధించిన విద్యార్థుల సంఖ్య 70కు చేరడం విశేషమని యాజమాన్యం పేర్కొంది. ఈ సందర్భంగా ఇంతటి ఘన విజయం సాధించిన విద్యార్థులను, అహర్నిశలు శ్రమించిన అధ్యాపక బృందాన్ని ప్రతిభ కళాశాల యాజమాన్యం అభినందించింది. విద్యార్థుల విజయానికి సహకరించిన తల్లిదండ్రులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపింది. ఈ సందర్భంగా కళాశాల సలహాదారులు కె. మంజులాదేవి, వి. లక్ష్మారెడ్డి, కె. రఘువర్ధన్ రెడ్డి, కె. విష్ణువర్ధన్ రెడ్డి, కె. జనార్ధన్ రెడ్డి, జి. వెంకటేశ్వర్ రెడ్డి, ప్రిన్సిపాల్స్ ఎస్. వెంకటరామయ్య, ఎం. శ్రీనివాసరావు, శ్రీదేవి, మెడికల్ అకాడమీ నిర్వహకులు జయప్రకాష్ విద్యార్థులను అభినందించి వారి ఉజ్వల భవిష్యత్తుకు శుభాకాంక్షలు తెలిపారు.

# నేడు జడ్చర్ల లో శ్రీ జగన్నాథ రథయాత్ర మహోత్సవం



జడ్చర్ల, జూలై 17 సమయం ప్రతినిధి: జడ్చర్ల పట్టణంలో ఇస్కాన్ సంస్థ ఆధ్వర్యంలో తొలిసారిగా నిర్వహించనున్న శ్రీ జగన్నాథ రథయాత్ర మహోత్సవం శనివారం పట్టణంలో జరగనుంది. ఈ సందర్భంగా రథయాత్రకు సంబంధించిన కరపత్రాన్ని మాజీ మంత్రి డా. సి. లక్ష్మారెడ్డి ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ, జగన్నాథ రథయాత్ర భక్తి, ఆధ్యాత్మికతకు ప్రతీక అని పేర్కొన్నారు. జడ్చర్ల పట్టణ యువత, ప్రజలు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని రథయాత్రను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఇస్కాన్ ప్రతినిధులు రథయాత్ర ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. భక్తులకు ప్రత్యేక దర్శన, ప్రసాద వసతులు కల్పిస్తున్నామని పేర్కొన్నారు. పట్టణంలోని ప్రధాన వీధుల గుండా రథయాత్ర సాగనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఇస్కాన్ సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు కోడిగల్ యాదయ్య , ప్రశాంత్ రెడ్డి పిట్టల మురళి, లావణ్య,భక్తులు తదితరులు పాల్గొన్నారు.



# ట్రిబుల్ ఐటీ లో ప్రతిభ చూపిన విద్యార్థికి మాజీ మంత్రి సన్మానం

## ఆల్ ఇండియా స్థాయిలో ర్యాంక్ సాధించడం హర్షణీయం.

వనపర్తి : పట్టణంలోనీ 11వార్డు(రాం నగర్ కాలనీ)కి చెందిన నాగనమోని.శ్రీలత రాములు కుమారుడు తేజేశ్వర్ ఇటీవల జరిగిన I.I.I.T పోటీ పరీక్షలలో ఆల్ ఇండియా స్థాయిలో 792 ర్యాంక్ సాధించి గుజరాత్ రాష్టం గాంధీనగర్ విశ్వవిద్యాలయంలో సీటు సాధించిన విషయం తెలుసుకున్న లిమాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి వారి స్వగృహంలో తేజేశ్వర్ ను సన్మానించి అభినందించారు. I.I.I.T లో తేజేశ్వర్ సీటు సాధించి పట్టణ ప్రతిష్ఠ పెంచడం హర్షణీయమని భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదిగి పేద ప్రజలకు సేవచేసి సమాజంలో మంచి పేరు తెచ్చుకోవాలి అని ప్రశంసించారు. నూతన వస్త్రాలు బహుకరించి ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో కె.మాణిక్యం,కౌన్సిలర్ స్వాతి హరిబాబు,రఘువర్ధన్ రెడ్డి,ధర్మా నాయక్, హేమంత్ ముదిరాజ్ గంగ ప్రసాద్,మహేశ్వర్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

# రేషన్ కార్డుదారులందరూ ఈ-కేవైసీ తప్పనిసరి

మహబూబాబాద్, జూలై 17, సమయం ప్రతినిధి : మహబూబాబాద్ జిల్లాలోని రేషన్ కార్డుదారులందరూ ఈ నెలాఖరులోగా ఈ-కేవైసీ ప్రక్రియను తప్పనిసరిగా పూర్తి చేయాలని జిల్లా పౌరసరఫరాల అధికారి జాటోత్ రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. రేషన్ కార్డులో నమోదైన ప్రతి కుటుంబ సభ్యుడు తమకు కేటాయించిన చౌకధరల దుకాణానికి వెళ్లి బయోమెట్రిక్ ధృవీకరణ ద్వారా ఈ-కేవైసీ చేయించుకోవాలని ఆయన సూచించారు. జిల్లాలోని పలు రేషన్ కార్డుల్లో ఒకరు లేదా ఇద్దరు సభ్యులు మాత్రమే ఈ-కేవైసీ పూర్తి చేయగా, మిగిలిన కుటుంబ సభ్యులు ఇంకా ప్రక్రియ పూర్తి చేయలేదని అధికారులు గుర్తించినట్లు తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న బియ్యం, ఇతర నిత్యావసర సరుకులు, సంక్షేమ పథకాల ప్రయోజనాలు నిరంతరాయంగా అందాలంటే రేషన్ కార్డులో నమోదైన ప్రతి సభ్యుడి ఈ-కేవైసీ తప్పనిసరిగా పూర్తి కావాలని స్పష్టం చేశారు. ఈ-కేవైసీ ప్రక్రియకు సంబంధించి ఏవైనా సందేహాలు ఉంటే సంబంధిత చౌకధరల దుకాణం డీలర్‌ను లేదా మండల రెవెన్యూ అధికారులను సంప్రదించాలన్నారు.

# హక్కులు పోరాడితేనే వస్తాయి.. భిక్షగా రావు

## దళిత క్రైస్తవుల సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమం ఉధృతం: సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ







**మహబూబ్‌నగర్ టౌన్, జూలై 17 (సమయం ప్రతినిధి):** దళిత క్రైస్తవులకు న్యాయంగా రావాల్సిన హక్కులు పోరాటం ద్వారానే సాధ్యమవుతాయని, అవి ఎప్పటికీ భిక్షగా రావని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ అన్నారు. ఇక మౌనం వీడి హక్కుల సాధన కోసం ఉద్యమానికి సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. దళిత క్రైస్తవ జేఏసీ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కేంద్రంలోని జేజేఆర్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన దళిత క్రైస్తవ గర్జన సభకు ఉమ్మడి పాలమూరు జిల్లా నలుమూలల నుంచి దళిత క్రైస్తవులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. సభా ప్రాంగణం జనసందోహంతో నిండిపోగా, హక్కుల సాధనకు మద్దతుగా నినాదాలు మార్మోగాయి. ఈ సందర్భంగా జాన్ వెస్లీ మాట్లాడుతూ, దళిత క్రైస్తవులకు రాజ్యాంగబద్ధంగా లభించాల్సిన హక్కులు, అవకాశాలు ఇప్పటికీ పూర్తిస్థాయిలో అందడం లేదన్నారు. ప్రభుత్వాలు వారిని కేవలం ఓటు బ్యాంకుగా మాత్రమే ఉపయోగించుకుంటున్నాయని ఆరోపించారు. దళిత క్రైస్తవుల న్యాయమైన డిమాండ్లను వెంటనే అమలు చేయాలని, లేకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. క్రైస్తవులు స్థాపించిన విద్యాసంస్థల్లో చదువుకుని ఎదిగిన వారే క్రైస్తవులపై విమర్శలు చేయడం విచారకరమన్నారు. దేశంలోని పలువురు ప్రముఖుల పిల్లలు విదేశాల్లోని క్రైస్తవ దేశాల్లో విద్యాభ్యాసం చేసి ఉద్యోగాలు చేస్తున్నప్పటికీ, దేశంలో మాత్రం మత రాజకీయాలతో ప్రజలను విభజించే ప్రయత్నాలు జరుగుతున్నాయని వ్యాఖ్యానించారు. సభలో పాల్గొన్న ప్రజల భారీ హాజరు దళిత క్రైస్తవుల ఐక్యతకు నిదర్శనమని నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పీసీసీ కార్యదర్శి వినోద్ కుమార్, జేఏసీ కన్వీనర్ కాశపోగు ప్రసాద్, పాస్టర్ అసోసియేషన్ నాయకులు సుందర్ పాల్, బీఎస్ పరంజ్యోతి, పృథ్వీరాజ్, సలహాదారులు యోనా సతీష్, మిట్టు, అడ్డాకుల జగన్‌తో పాటు ఉమ్మడి పాలమూరు జిల్లా నలుమూలల నుంచి వచ్చిన దళిత క్రైస్తవులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# విద్యార్థులు ప్రణాళికతో చదివితే మంచి ఫలితాలు





వెనుకబడ్డ సబ్జెక్టులపై ప్రత్యేక దృష్టి సారించాలి.
ఎస్ఐఆర్ ప్రక్రియను వేగవంతం చేయాలి.
ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఏ రంగంలోనైనా రాణించాలంటే విద్యార్థులు ప్రణాళికతో చదివి మంచి ఫలితాలు సాధించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు.

**సమయం ప్రతినిధి, జోగులాంబ గద్వాల జిల్లా:** శుక్రవారం గద్వాలలోని ప్రభుత్వ అభ్యసన ఉన్నత పాఠశాలను కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పలు తరగతి గదులకు వెళ్లి ఉపాధ్యాయులు బోధిస్తున్న విధానాన్ని పరిశీలించి తగు సూచనలు చేశారు. ప్రభుత్వ ఎంఏఎల్ డి డిగ్రీ కళాశాల విద్యార్థులు ఇంటర్న్‌షిప్‌లో భాగంగా కంప్యూటర్, ఏఐ టెక్నాలజీపై పాఠశాల విద్యార్థులకు థియరీతోపాటు ప్రయోగపూర్వకంగా అవగాహన కలిగేలా బోధించాలని సూచించారు. విద్యార్థులు పాఠశాలకు తరచూ గైర్హాజరైతే ఉపాధ్యాయులు చెప్పే పాఠాలను అర్థం చేసుకోలేకపోతారని, ప్రతి నిత్యం వస్తేనే వివిధ పాఠ్యాంశాలపై మంచి పట్టు సాధించవచ్చన్నారు. వెనుకబడ్డ సబ్జెక్టులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పదవ తరగతి విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని, 2026-27 విద్యా సంవత్సరంలో ఈ పాఠశాల నుంచే జిల్లా టాపర్ ఉండాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ పాఠశాలల్లో అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని, ఈ పాఠశాలలో అదనపు తరగతి గదులు కూడా నిర్మించడంతో ప్రవేశాలు ఇంకా పెరగాలని ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు విష్ణును ఆదేశించారు.

యస్ఐఆర్ ప్రక్రియను పరిశీలించిన జిల్లా కలెక్టర్

అంతకుముందు 16వ వార్డ్ భీమ్ నగర్ పరిధిలోని పోలింగ్ స్టేషన్ నెంబర్ 256కు సంబంధించి బిఎల్ ఓలు నిర్వహిస్తున్న ఎస్ఐఆర్ ప్రక్రియను జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఎవరికైనా రెండు ఓట్లు ఉంటే గుర్తించి వారు ఏదో ఒక చోటే మ్యాపింగ్ అయ్యేలా ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం ముందుకు వెళ్లాలన్నారు. ఓటర్లకు ఇచ్చిన ఎన్యుమరేషన్ పత్రాలను పూరించాక తిరిగి తీసుకొని డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. ఓటరు జాబితాలో ఎలాంటి తప్పిదాలు లేకుండా పారదర్శకంగా రూపొందించేందుకే ఎన్నికల సంఘం ఓటర్ జాబితా ప్రత్యేక సమగ్ర సవరణను చేపట్టిందని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ఈ పర్యటనలో గద్వాల తహసీల్దార్ హరికృష్ణ, ఎన్నికల డిటీ ఉదయ్ కిరణ్, ఆర్ఐ వెంకటేశ్వర్ రెడ్డి, సూపర్వైజర్ తిమ్మప్ప, బిఎల్ఓ సునీత, తదితరులున్నారు.

## వాగ్దేవి నీట్ అకాడమీకి ఘన విజయం

## నీట్-2026లో 32కు పైగా మెడికల్ సీట్లతో సత్తా చాటిన విద్యార్థులు




**మహబూబ్‌నగర్, జూలై 17 (సమయం ప్రతినిధి):** నీట్ యూజీ-2026 పరీక్ష ఫలితాల్లో జిల్లా కేంద్రంలోని వాగ్దేవి నీట్ అకాడమీ విద్యార్థులు విశేష ప్రతిభ కనబర్చి మరోసారి విజయఢంకా మోగించారు. ఈ విషయాన్ని అకాడమీ కరస్పాండెంట్ విజేత వెంకట్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా విజయం సాధించిన విద్యార్థులందరినీ అభినందించిన ఆయన, వన్ క్లాస్ ప్రత్యేక విధానం, ఇన్నోవేటివ్ సైంటిఫిక్ టీచింగ్ అప్రోచ్‌తో నాణ్యమైన విద్యను అందించడం వల్లే ఈ విజయం సాధ్యమైందన్నారు. జాతీయ స్థాయిలో పోటీ పడే ఆత్మవిశ్వాసాన్ని విద్యార్థుల్లో పెంపొందించి, సాధారణ విద్యార్థులను సైతం వైద్య విద్యలో రాణించే స్థాయికి తీసుకువచ్చిన ఘనత వాగ్దేవి అకాడమీదేనని పేర్కొన్నారు. ఆర్థికంగా వెనుకబడిన నిరుపేద విద్యార్థులకు ఉచిత కోచింగ్ అందిస్తూ, వారి డాక్టర్ కావాలనే కలను సాకారం చేయడం తమ విద్యాసంస్థ లక్ష్యమని తెలిపారు. ఈ విజయానికి అధ్యాపకుల సమిష్టి కృషి, విద్యార్థుల పట్టుదల, తల్లిదండ్రుల సహకారమే కారణమన్నారు. అకాడమీలోని 68 మంది విద్యార్థుల్లో ధర్మ 554 మార్కులు, సిద్ధార్థ 465 మార్కులు, రబ్ షా 452 మార్కులు సాధించగా, మొత్తం 32కు పైగా మెడికల్ సీట్లు సాధించి అకాడమీకి ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చారని తెలిపారు. ఈ సందర్భంగా విజయవంతమైన విద్యార్థులను యాజమాన్యం ఘనంగా అభినందించి, వారి ఉజ్వల భవిష్యత్తుకు శుభాకాంక్షలు తెలిపింది. ఈ కార్యక్రమంలో ఐఐటీ--నీట్ అకాడమీ ఇన్‌చార్జి పావని రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ గీతాదేవి, వైస్ ప్రిన్సిపాల్ జ్యోతి నందన్ రెడ్డి, అకాడమీ అడ్వైజర్ యాకూబ్, ఎంసెట్ ఇన్‌చార్జి షాకీర్, పరీక్షల ఇన్‌చార్జి చెన్నయ్య, యాజమాన్య సభ్యులు కోట్ల శివకుమార్, సతీష్ రెడ్డి, నాగేందర్, రాఘవేంద్రరావు, అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## పిడుగుపాటు ఘటనల్లో మృతి చెందిన 8 కుటుంబాలకు రూ.6 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా సాయం విడుదల



జోగులాంబ గద్వాల: జిల్లాలో పిడుగుపాటు ఘటనల్లో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబ సభ్యుల బ్యాంకు ఖాతాల్లో రూ. 6 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా జమ చేసినట్లు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో పిడుగుపాటు ఘటనల్లో మృతి చెందిన వారి కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఎక్స్‌గ్రేషియా సహాయాన్ని సంబంధిత లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో నేరుగా ఈనెల 13వ తేదీన ఎలక్ట్రానిక్ క్లియరెన్స్ సిస్టమ్ ద్వారా వారి ఖాతాలకు నేరుగా జమ చేసినట్లు తెలిపారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టపోయిన కుటుంబాలకు ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, బాధితులకు తక్షణ ఆర్థిక ఉపశమనం కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం నిబంధనల మేరకు ఎక్స్‌గ్రేషియా సాయాన్ని విడుదల చేసినట్లు పేర్కొన్నారు. ఇందులో భాగంగా మల్దకల్ మండలం గార్లపాడు గ్రామానికి చెందిన బి. నవీన్ కుమార్, రాజోలి మండలం రాజోలి గ్రామానికి చెందిన కుర్వ వెంకటేష్, మల్దకల్ మండలం పవనపల్లి (హెచ్), పాల్వాయికి చెందిన కె. రాఘవేంద్ర, గద్వాల మండలం బాస్లచెరువు గ్రామానికి చెందిన గొల్ల శశిధర్, అలంపూర్ మండలం క్యాతూర్ గ్రామానికి చెందిన వేముల రాజు, ఇటిక్యాల మండలం పెద్దదిన్నె గ్రామానికి చెందిన పెద్ద నర్సింహులు, మల్దకల్ మండలానికి చెందిన కుమారి వడ్డె ఆదిలక్ష్మి, గద్వాల మండలం గుంటిపల్లి గ్రామానికి చెందిన బి. రాజుకు రూ.6.00 లక్షలు చొప్పున ఎక్స్‌గ్రేషియా మొత్తాన్ని వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. ప్రకృతి వైపరీత్యాల కారణంగా నష్టపోయిన అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ నిబంధనల మేరకు సత్వర ఆర్థిక సహాయం అందించేందుకు జిల్లా యంత్రాంగం ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని కలెక్టర్ తెలియజేశారు.

## పీఏ పల్లి, గుడిపల్లి మండలాల్లో నిరంతర విద్యుత్ సరఫరా కల్పించాలి

-దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్




దేవరకొండ: జూలై 17(సమయం ప్రతినిధి) : పీఏ పల్లి, గుడిపల్లి మండలాల్లో నిరంతర విద్యుత్ సరఫరా కల్పించాలి అని దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ అన్నారు. శుక్రవారం పీఏ పల్లి మండలం అంగడిపేట ఎక్స్ రోడ్‌లోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో దేవరకొండ మాజీ శాసనసభ్యులు శ్రీ రమావత్ రవీంద్ర కుమార్ మాట్లాడుతూ.....ఉమ్మడి మండలాలైన పీఏ పల్లి, గుడిపల్లిలో విద్యుత్ కోతలు తీవ్ర స్థాయిలో కొనసాగుతున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం రైతులు వరి నాట్లు వేస్తున్న కీలక సమయంలో తరచూ విద్యుత్ సరఫరా నిలిపివేయడం వల్ల వ్యవసాయ పనులకు తీవ్ర అంతరాయం కలుగుతోందని పేర్కొన్నారు. అలాగే తాగునీటి అవసరాలు కూడా దెబ్బతింటున్నాయని అన్నారు. రైతుల సాగు, ప్రజల తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఎలాంటి అంతరాయం లేకుండా 24 గంటల నిరంతర విద్యుత్ సరఫరా అందించాలని సంబంధిత విద్యుత్ శాఖ అధికారులను ఆయన కోరారు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు స్పందించి విద్యుత్ కోతలను వెంటనే నిలిపివేయాలని, లేనిపక్షంలో ఉమ్మడి మండలాల్లోని విద్యుత్ సబ్‌స్టేషన్లను బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ముట్టడించే కార్యక్రమాన్ని చేపడతామని మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్ర కుమార్ హెచ్చరించారు.

## పాదయాత్రలకు నేతలు..

హైదరాబాద్ : మరో ఏడాది తర్వాత తెలుగు రాష్ట్రాల్లో రాజకీయ పాదయాత్రల సందడి మొదలు కానుంది. ఎన్నికలకు ముందు ప్రజల్లోకి వెళ్లేందుకు ప్రధాన పార్టీలు మరోసారి పాదయాత్రలను ప్రధాన రాజకీయ ఆయుధంగా ఎంచుకుంటున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నికలకు రెండేళ్ల ముందు రాష్ట్రవ్యాప్తంగా పాదయాత్ర చేపడతానని వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఇప్పటికే ప్రకటించారు. మరోవైపు తెలంగాణలో వచ్చే ఏడాది రాష్ట్రవ్యాప్తంగా పాదయాత్ర నిర్వహిస్తానని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వెల్లడించారు. దీంతో ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ప్రతిపక్ష ప్రధాన పార్టీలు ప్రజలతో నేరుగా మమేకమయ్యే వ్యూహాన్ని అమలు చేయనున్నట్లు స్పష్టమవుతోంది. రానున్న ఎన్నికల రాజకీయాల్లో ఈ పాదయాత్రలు కీలక పాత్ర పోషించే అవకాశాలు కనిపిస్తున్నాయి. జగన్‌కు పాదయాత్ర కొత్త కాదు. 2019 ఎన్నికలకు ముందు 2017 నవంబర్‌లో ప్రారంభించిన 'ప్రజా సంకల్ప యాత్ర'ను 2019 జనవరిలో ముగించారు. 341 రోజుల పాటు సాగిన ఈ యాత్రలో ఆయన 3,648 కిలోమీటర్లకు పైగా నడిచి రాష్ట్రవ్యాప్తంగా ప్రజలను కలుసుకున్నారు. ఆ పాదయాత్ర అనంతరం జరిగిన ఎన్నికల్లో వైసీపీ ఘన విజయం సాధించి అధికారంలోకి వచ్చింది. అయితే 2024 ఎన్నికల్లో పరాజయం పాలైన తర్వాత మరోసారి ప్రజల్లోకి వెళ్లేందుకు జగన్ పాదయాత్రకు సిద్ధమవుతున్నారు. మరోవైపు కేటీఆర్ కు ఇది తొలి పాదయాత్ర కానుంది.

## రైతులకు నీళ్లివ్వడంలో కాంగ్రెస్ సర్కార్ విఫలం....

- పంటల వేసుకునేందుకు సాగునీరు నీ వెంటనే విడుదల చేయాలి....
ర్యాలంపాడు,గుడ్డెందొడ్డి, రిజర్వాయర్ల కాలువలను సందర్శించిన బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జి బాసు హనుమంతు







గద్వాల : కాలువలో చెట్లు ను తొలగించలేని స్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నదని బాసు హనుమంతు నాయుడు అన్నారు.....ఈరోజు గద్వాల నియోజకవర్గం ధరూర్ మండలం పలు గ్రామంలో గుడ్డెందొడ్డి,ర్యాలంపాడు రిజర్వాయర్ ల కింద ఉన్న కాలువలను పార్టీ నాయకులు ,రైతులతో కలిసి బాసు హనుమంతు నాయుడు పరిశీలించారు.... అనంతరం, బిగుడ్డెందొడ్డి,ర్యాలంపాడు రిజర్వాయర్ ని సందర్శించి, ప్రస్తుతం రిజర్వాయర్లో నీటి సామర్థ్యాన్ని అడిగి తెలుసుకున్నారు.... జూరాల రైట్ మెయిన్ కెనాల్ ను సందర్శించిన ఆయన,పూర్తిగా డ్యామేజ్ ఆయనది, దానిని తొందరలో మరమ్మత్తులు చేయాలని సూచించారు. అదే విధంగా,బి?మహిళ కూలీలను కలిసినా బాసు హనుమంతు నాయుడు ,మళ్లీ కెసిఆర్ ప్రభుత్వమే రావాలని వారు నినాదాలు చేశారు...బిబిబిఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ....శ్రీశ్రీగుడ్డెందొడ్డి రిజర్వాయర్లో 1 టీఎంసీ సామర్థ్యం నీళ్లు ఉన్న,రైతులు పంట పొలాల వేసుకునేందుకు కాలువలకు నీళ్లు ఇవ్వలేని స్థితిలో ఈ కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నదని ధ్వజమెత్తారు.... కనీసం కాలువల్లో చెట్లను(జమ్ము) ను తొలగించలేని స్థితిలో ఈ కాంగ్రెస్ ప్రభుత్వము ఉన్నాదని ఆరోపించారు. నీళ్లు ఇవ్వాలని అడిగితే కేటీఆర్, హరీష్ రావు కోసి రక్తం పంటలకు చల్లితే పండుతాయని ముఖ్యమంత్రి అనడం ఎంతవరకు సముచితమని ప్రశ్నించారు...? ముఖ్యమంత్రి హోదాలో ఉండి ఇలా మాట్లాడడం సిగ్గుచేటని విమర్శించారు.. ..రైతులను,ప్రజాస్వామ్యాన్ని అవనమానించేలా ఉన్నాయన్నారు. బీఆర్ఎస్ పాలనలో రైతులకు రెండు పంటలకు సాగునీటిని అందించిన ఘనత కెసిఆర్ దే అని అన్నారు. 24 గంటల విద్యుత్,పెట్టుబడి సాయం, రైతుబీమా వంటి పథకాలు ఎన్నో అందించారని గుర్తు చేశారు. కానీ రేవంత్ రెడ్డి వచ్చాక ఒక్క స్కీం కూడా అమలు చేయలేదని విమర్శించారు. పంటలు వేసుకునేందుకు అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ సహకారంతో ఎప్పటికప్పుడు నీళ్లిచ్చి,పంటలను కాపాడామని గుర్తు చేశారు. వెంటనే అధికారులు స్పందించి రైతులకు పంటలు వేసుకునేందుకు కాల్వలకు నీళ్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు.. ఈ కార్యక్రమంలో జి.రాఘవేంద్ర రెడ్డి, అల్లాపాడు ప్రతాప్, శ్రీనివాస్ గౌడ్,సీ.కే. రంగన్న,చిన్నపాడు ఆంజనేయులు,ధర్మ రావు,బీచుపల్లి,లాలప్ప,మంత్ర నాయక్, మోనేష్ మారోజు,వెంకటేష్ నాయుడు,జాంపల్లి భరత్ సింహారెడ్డి,కావాలి గోపి,గోవిందు, రాము,రజిని బాబు, నరసింహులు,సుభాష్ రంగారెడ్డి, వెంకటేష్,రమేష్,మాలిక్, ప్రవీణ్, కృష్ణ, మోహన్, భీమేష్, ఆంజనేయులు, నాగేష్,ఈరన్న,తిమ్మప్ప, రాముడు, మల్లికార్జున్, మహేందర్, నరేష్,హరికృష్ణ, వీరేష్,జయన్న, వెంకటప్ప, శివ,నాగరాజు,కళ్యాణ్,మరియు పార్టీ నాయకులు, కార్యకర్తలు, వివిధ గ్రామాల రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# డైట్ మెనూను అమలు చేయాలి : జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్

మహబూబాబాద్, జూలై 17, సమయం ప్రతినిధి : ప్రభుత్వం నిర్దేశించిన డైట్ మెనూను తప్పనిసరిగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లాలోని చిన్నగూడూరు మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంను ఆకస్మికంగా తనిఖీ చేశారు. వారికి అందుతున్న విద్యా సౌకర్యాలు, మధ్యాహ్న భోజనం, వసతి, ఇతర సదుపాయాలపై స్వయంగా వివరాలు తెలుసుకొని వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్య యొక్క ప్రాముఖ్యత, క్రమశిక్షణ, ఉన్నత లక్ష్యాల సాధనపై విద్యార్థినులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా చిన్నగూడూరు మండల కేంద్రంలోని కె జీబీవి తో పాటు జయ్యారం మండల ప్రజా పరిషత్ పాఠశాలను సందర్శించిన కలెక్టర్, అక్కడి విద్యా, వసతి ఏర్పాట్లను పరిశీలించారు. ప్రతి సబ్జెక్టుతో పాటు ఆంగ్ల మాధ్యమ బోధన నాణ్యతను మెరుగుపర్చేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. డిజిటల్ తరగతుల ద్వారా ఉన్నత ప్రమాణాలతో బోధన నిర్వహించడంతో పాటు విద్యార్థుల ఆంగ్ల భాషా నైపుణ్యాల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే కెరీర్ గైడెన్స్, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్యం, యోగా వంటి అంశాలపై శిక్షణ అందించాలని సూచించారు. విద్యార్థులు, సిబ్బందికి షెడ్యూల్ ప్రకారం వైద్య పరీక్షలు నిర్వహించాలని, రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం, కింద రక్తహీనత, పరిశుభ్రత, సీజనల్ వ్యాధులు, పోషకాహారం, మానసిక ఆరోగ్యంపై నిరంతర పర్యవేక్షణ చేపట్టాలన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు వంద శాతం ఉండేలా చర్యలు తీసుకోవడంతో పాటు పాఠ్యపుస్తకాలు, యూనిఫాంల కొరత లేకుండా చూడాలని సూచించారు. జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి విద్యాసంస్థలు, వసతి గృహాల్లో ఇప్పటికే 18 ఆకస్మిక తనిఖీలు నిర్వహించిన స్నేహ శబరీష్, విద్య, ఆహారం తదితర అంశాల్లో నిర్లక్ష్యం వహించే సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటూ పిల్లలకు నాణ్యమైన విద్య అందించేందుకు కృషి చేస్తున్నారు. అలాగే వ్యవసాయం, ఆరోగ్యం, పోషకాహారం తదితర అంశాల్లో క్షేత్రస్థాయిలో ప్రజా సమస్యలను నేరుగా పరిశీలించి, అక్కడికక్కడే పరిష్కార చర్యలు చేపడుతున్నారు. ఈ పర్యటనలో జిల్లా విద్యాశాఖ అధికారి అల్వాల సత్యనారాయణమూర్తి, తహసీల్దార్ కిరణ్ కుమార్, జీసీడీవో వై. గాయత్రి తదితర అధికారులు కలెక్టర్ వెంట పాల్గొన్నారు.





## మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ స్వార్థ రాజకీయాలు ఆపాలి

- ఆటో డ్రైవర్లను ఆదుకునేది కాంగ్రెస్ పార్టీయే
- ఐఎన్టీయూసీ జిల్లా అధ్యక్షులు రాములుయాదవ్




మహబూబ్ నగర్ : ఆటో డ్రైవర్లను అడ్డం పెట్టుకొని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ చేస్తున్న స్వార్థ రాజకీయాలు మానుకోవాలని ఐఎన్టీయూసీ ఆటోయూనియన్ జిల్లా అధ్యక్షులు రాములు యాదవ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిన్న ఆర్టీసీ బస్టాండ్ వద్ద మాజీ మంత్రి చేసినా హల్ చల్ ను చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని ఎద్దేవాచేశారు. గత పదేళ్ల కాలంలో ఏనాడు ఆటో కార్మికులను పట్టించుకోని మీ ప్రభుత్వం ఈ రోజు మొసలి కన్నీరు కారుస్తున్నారని ఆరోపించారు. ఆర్టీసీ బస్టాండ్ ఇన్ గేట్ వద్ద ఆటోలను నిలపాలనే విషయమై ఎమ్మెల్యే ఆదేశాలతో డిప్యూటీ మేయర్ ఎం. సురేందర్ రెడ్డి ఆర్టీసీ ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించడం జరిగిందన్నారు. అదేవిధంగా ఎమ్మెల్యే ఆదేశానుసారం డిప్యూటీ మేయర్ ఆర్టీసీ ఉన్నతాధికారులతో మాట్లాడి పార్టీలకతీతంగా ఆటో డ్రైవర్ల పై ఎలాంటి కేసులు నమోదు కాకుండా సమస్యను పరిష్కరించడం జరిగిందన్నారు. కానీ మాజీ మంత్రి కొంతమంది బీఆర్ఎస్ అనుకూల ఆటో డ్రైవర్లను వెంటపెట్టుకొని ఏదో తానే సమస్యను పరిష్కరించినట్లు చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ ప్రకారం ఆటో డ్రైవర్లకు సంక్షేమ బోర్డుతో పాటు ఏడాదికి రూ.12వేల ఆర్థికసాయం అందజేస్తుందన్నారు. త్వరలో ఆటో కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి తీపికబురు అందుకుంటారని తెలిపారు. సమావేశంలో ఆటో యూనియన్ పట్టణ అధ్యక్షులు వినయ్ కుమార్, ఉపాధ్యక్షులు ఖాదర్, నాగరాజు, మనోహర్, రాజు, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల భద్రతే లక్ష్యం



మహబూబాబాద్, జూలై 17, సమయం ప్రతినిధి :జిల్లాలో విద్యార్థుల భద్రత విషయంలో ఎలాంటి రాజీ ఉండదని, ప్రత్యేక తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని, నిబంధనలు ఉల్లంఘిస్తూ విద్యార్థులను తరలించే వాహనాలపై కేసులు నమోదు చేసి, అవసరమైతే సీజ్ చేయడంతో పాటు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా రవాణా అధికారి శంకర్ నాయక్ శుక్రవారం ప్రకటన లో తెలిపారు. తెలంగాణ రాష్ట్ర రవాణా శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు పాఠశాలలకు విద్యార్థులను తరలించే ఆటోల్లో పరిమితికి మించి విద్యార్థులను ఎక్కించడం, డ్రైవర్ పక్కన పిల్లలను కూర్చోబెట్టడం, స్కూల్ బ్యాగులను వాహనం వెలుపల వేలాడదీయడం పూర్తిగా నిషేధమని, ప్రతి వాహనానికి చెల్లుబాటు అయ్యే ఫిట్‌నెస్ సర్టిఫికెట్, పర్మిట్, ఇన్సూరెన్స్, డ్రైవింగ్ లైసెన్స్, పొల్యూషన్ అండర్ కంట్రోల్ (పీయుసీ) సర్టిఫికెట్ తప్పనిసరిగా ఉండాలన్నారు. జిల్లాలో కొన్ని ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులను మూడు చక్రాల ఆటోలు, టాటా మ్యాజిక్, మారుతి ఓమ్ని వ్యాన్లలో నిబంధనలకు విరుద్ధంగా తరలిస్తున్నట్లు గుర్తించామని తెలిపారు. అలాంటి వాహనాలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించి, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కేసులు నమోదు చేయడంతో పాటు అవసరమైతే వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. డ్రైవర్లు వేగ పరిమితిని పాటిస్తూ అప్రమత్తంగా వాహనాలు నడపాలని, మద్యం సేవించి లేదా మొబైల్ ఫోన్ ఉపయోగిస్తూ డ్రైవింగ్ చేయరాదని సూచించారు. వాహనాలను సాంకేతికంగా సురక్షిత స్థితిలో ఉంచడంతో పాటు అన్ని ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని అన్నారు. తల్లిదండ్రులు ఓవర్‌లోడ్ వాహనాల్లో పిల్లలను పంపవద్దని, వాహనాలకు అవసరమైన అన్ని పత్రాలు, డ్రైవర్‌కు చెల్లుబాటు అయ్యే లైసెన్స్ ఉన్నాయో లేదో నిర్ధారించుకోవాలన్నారు. వీలైనంత వరకు పాఠశాల సమీపంలో నివసించే వారు తమ పిల్లలను స్వయంగా పాఠశాలకు తీసుకెళ్లి తీసుకురావాలన్నారు. ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు కూడా విద్యార్థుల భద్రత విషయంలో ప్రత్యేక బాధ్యతతో వ్యవహరించాలని తెలిపారు. నిబంధనలకు అనుగుణంగా అన్ని పత్రాలు ఉన్న వాహనాలకే పాఠశాల ఆవరణలోకి అనుమతి ఇవ్వాలని, ఓవర్‌లోడ్‌తో వచ్చే వాహనాలను ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించవద్దని స్పష్టం చేశారు. విద్యార్థుల భద్రత విషయంలో నిర్లక్ష్యం ప్రదర్శించే పాఠశాలల యాజమాన్యాలపై కూడా నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## డీ లిమిటేషన్ బిల్లుకు కాంగ్రెస్ సపోర్టా.... రేవంత్ వాదనేంటీ

హైదరాబాద్ : తెలంగాణా ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి మరో రెండు టెర్ములు తనదే అధికారం అని ప్రతీ సభలో చెబుతూ ఉంటారు. రాసి పెట్టుకోండి అని ఆయన అంటున్నారు. ఇక తాజాగా ఆయన ఖమ్మం సభలో అయితే మీడియాకు నంబర్ చెప్పి మరీ మాకు 2029 లో వచ్చే సీట్లు ఇవ్వే లెక్క కరెక్ట్ అని పక్కాగా చెప్పారు. మాకు 117 సీట్లు వస్తాయని ఆయన అన్నారు. తెలంగాణాలో సీట్లు 182 దాకా పెరుగుతాయని అందులో 117 ఒక్క కాంగ్రెస్ కే సొంతంగా వస్తాయని ఆయన స్పష్టం చేశారు. : ఇదిలా ఉంటే రేవంత్ రెడ్డిని ఎవరు తక్కువగా అంచనా వేసినా పప్పులో కాలేసినట్లే అని అంటున్నారు. అలాగే 2023 ఎన్నికల్లో బీఆర్ఎస్ అధినేతలు లైట్ తీసుకున్నారు. దానికి గానూ ఏకంగా భారీ మూల్యం చెల్లించి గద్దె దిగాల్సి వచ్చింది. మరి ఇపుడు చూస్తే రేవంత్ రెడ్డి అధికారంలో ఉన్నారు. ప్రభుత్వం నడుపుతున్నారు. పైగా కాంగ్రెస్ అధినాయకత్వం వద్ద ఆయనకు మంచి పేరు ఉంది. రాహుల్ గాంధీ ప్రియాంక గాంధీ ఆయనకే ఓటు వేస్తున్నారు. దాంతో మరో రెండు సార్లు కాంగ్రెస్ ని అధికారంలోకి తీసుకుని వస్తామని రేవంత్ తన వద్ద ఉన్న అంచనాలతోనే చెబుతున్నారు: తెలంగాణాలో ప్రస్తుతం 119 సీట్లు ఉన్నాయి. అవి ఏకంగా 182 దాకా అవుతాయని రేవంత్ రెడ్డి లెక్క కడుతున్నారు. ఇలా సీట్లు మరో డెబ్బై దాకా పెరిగితే అది కాంగ్రెస్ ప్రభుత్వానికే అనుకూలిస్తుంది అని ఆయన భావిస్తున్నారు. ఎపుడూ అధికారంలో ఉండే పార్టీకే ఈ సీట్ల పెరుగుదల అడ్వాంటేజ్ గా ఉంటుంది అని అంటున్నారు.

## గ్రామ పంచాయతీ ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను గడువులోగా పూర్తి చేయాలి

### జిల్లా అధికారులకు అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ ఆదేశం



మహబూబ్‌నగర్, జూలై 17 (సమయం ప్రతినిధి): గ్రామ పంచాయతీల సమగ్ర అభివృద్ధి కోసం ప్రభుత్వం రూపొందించిన గ్రామ పంచాయతీ స్ట్రాటజిక్ యాక్షన్ ప్లాన్ (జీపీ–ఎస్ఏపీ) అమలును నిర్దేశిత కాలపట్టిక ప్రకారం గడువులోగా పూర్తి చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో సర్క్యులర్ మెమో నెం.92–జీపీ–ఎస్ఏపీ రోడ్‌మ్యాప్ అండ్ టైమ్‌లైన్స్ అమలుపై జిల్లా స్థాయి అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం జారీ చేసిన సర్క్యులర్ మెమో నెం.92లో పేర్కొన్న మార్గదర్శకాల మేరకు ప్రతి గ్రామ పంచాయతీలో గ్రామస్థుల భాగస్వామ్యంతో స్థానిక అవసరాలను గుర్తించి, ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులను ఎంపిక చేయాలని సూచించారు. ప్రణాళికల రూపకల్పనలో పారదర్శకత పాటిస్తూ గ్రామసభల ద్వారా ఆమోదం పొందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. సంబంధిత శాఖల అధికారులు, మండల స్థాయి బృందాలు పరస్పర సమన్వయంతో పనిచేసి కార్యాచరణ ప్రణాళికలోని అన్ని దశలను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. గ్రామ పంచాయతీల సమగ్రాభివృద్ధికి ఈ ప్రణాళిక ఎంతో దోహదపడుతుందని, ప్రతి అధికారి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు. ఈ సమావేశంలో జెడ్పీ సీఈఓ ఇన్‌చార్జి, జిల్లా పంచాయతీ అధికారి వెంకటరెడ్డి, డీఆర్‌డీఓ నరసింహులు, సీపీఓ రవీందర్, ఆర్డీఓ నవీన్, పీడీ హౌసింగ్ ఉపేందర్ రెడ్డి, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి, జిల్లా బీసీ సంక్షేమ అధికారి, జిల్లా ఎస్సీ సంక్షేమ అధికారి, జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి, జిల్లా విద్యాశాఖ అధికారి, మున్సిపల్ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.

## మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేసిన బిజ్వారం గ్రామ సర్పంచ్ వై. శైలజ శ్రీనివాస్ రెడ్డి





సమయం ప్రతినిధి జోగులాంబ గద్వాల జిల్లా : జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండలం బిజ్వారం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం గ్రామ సర్పంచ్ వై. శైలజ శ్రీనివాస్ రెడ్డి మధ్యాహ్న భోజన పథకాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అందిస్తున్న భోజనం నాణ్యత, పరిశుభ్రత, మెనూ ప్రకారం వంటలు సిద్ధం చేస్తున్నారా లేదా అనే అంశాలను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి భోజనం నాణ్యతపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ వై. శైలజ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం విద్యార్థులకు ప్రతిరోజూ నాణ్యమైన, పోషకాహారంతో కూడిన భోజనాన్ని అందించాలని సంబంధిత సిబ్బందికి సూచించారు. విద్యార్థుల ఆరోగ్యం విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా ఎస్పీని కలిసిన నూతన ఎక్సైజ్ సూపరింటెండెంట్

ప్రజా భద్రతే లక్ష్యంగా పరస్పర సహకారంతో ముందుకు సాగాలి జిల్లా ఎస్పీ
మాదకద్రవ్యాలు, అక్రమ మద్యం నిర్మూలనకు సమిష్టి కార్యాచరణ




వనపర్తి జులై –17: వనపర్తి జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం జిల్లా ఎస్పీ శ్రీమతి సునిత రెడ్డి, ఇటీవల వనపర్తి జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్‌గా బాధ్యతలు స్వీకరించిన శ్రీ ఎం. లింగాచారి మర్యాద పూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ ఆయనకు హృదయపూర్వక స్వాగతం పలుకుతూ, నూతన బాధ్యతలలో విజయవంతంగా రాణించాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ..పోలీసు,శాఖ ఎక్సైజ్ శాఖల మధ్య సమన్వయం ప్రజా ప్రయోజనాల సాధనలో కీలకమని పేర్కొన్నారు. మాదకద్రవ్యాలు, అక్రమ మద్యం తయారీ రవాణా వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలను అరికట్టడంలో రెండు శాఖలు సమిష్టిగా పనిచేస్తే మరింత మెరుగైన ఫలితాలు సాధించాలన్నారు.ప్రజల ఆరోగ్యం, శాంతి భద్రతలను కాపాడటం ప్రతి ప్రభుత్వ శాఖ యొక్క ఉమ్మడి బాధ్యతని పోలీసు, ఎక్సైజ్ శాఖలు పరస్పర సహకారంతో పనిచేస్తూ అక్రమ మద్యం, మాదకద్రవ్యాల నిర్మూలనకు కట్టుబడి ఉండాలని ప్రజల్లో చట్టాలపై అవగాహన పెంపొందిస్తూ సురక్షిత సమాజ నిర్మాణానికి కలిసి కృషి చేయాలని ఎస్పీ సూచించారు.

## భారత్ నుంచి రష్యాకు పెట్రోల్...

న్యూఢిల్లీ : ఉక్రెయిన్?రష్యా వార్ మూడేళ్లుగా కొనసాగుతోంది. ఇటీవల ఉక్రెయిన్ డ్రోన్లతో రష్యాపై విరుచుకుపడుతోంది. యుద్ధం కారణంగా రష్యా ఆయిల్‌ను భారత్ కొనుగోలు చేస్తోంది. దీంతో రష్యాకు ఆర్థికంగా అండగా ఉంటుంది. ఈ కారణంతో భారత్‌పై అమెరికా సుంకాలు విధించింది. కానీ, ఇటీవలి ఇరాన్?అమెరికా వార్ కారణంగా రష్యా ఆయిల్ దిగుమతికి భారత్‌కు అనుమతి ఇచ్చింది. కానీ, ఉక్రెయిన్ దీర్ఘకాలిక డ్రోన్ దాడులతో రష్యా ఆయిల్ రిఫైనరీలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. 2025 ఆగస్టు నుంచి మరింత ఉధృతమైన ఈ దాడులు 2026 మధ్య నాటికి రష్యా మొత్తం రిఫైనింగ్ సామర్థ్యంలో సుమారు 40 శాతం వరకు పనిచేయకుండా చేశాయి. ఫలితంగా దేశంలో పెట్రోల్, డీజిల్ ఉత్పత్తి భారీగా తగ్గి, దేశవ్యాప్తంగా ఇంధన కొరత, రేషనింగ్, ధరల పెరుగుదల ఏర్పడ్డాయి. పలు ప్రాంతాల్లో ఇంధన అమ్మకాలపై నియంత్రణలు విధించారు. ఈ సంక్షోభం నేపథ్యంలో రష్యా ఇండియా నుంచి పెట్రోల్ దిగుమతులు ప్రారంభించింది. జూలై 2026 మొదటి వారంలోనే భారత్ నుంచి సముద్ర మార్గంలో కనీసం 60 వేల మెట్రిక్ టన్నుల పెట్రోల్ రష్యాకు చేరింది. ఇటీవల రోస్‌నెఫ్ట్, గాజ్‌ప్రామ్ నెఫ్ట్, లుకోయిల్ వంటి ప్రముఖ రష్యన్ కంపెనీలు భారతీయ ఆయిల్ రిఫైనరీలను సంప్రదించి అదనపు సరఫరా కోరాయి. ఇది రెండు దేశాల మధ్య శక్తి వాణిజ్యంలో ఒక విలక్షణమైన మార్పుగా చెప్పవచ్చు.



# గిరిజన విద్యార్థుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

**విద్య, వసతి, భద్రతపై రాజీ లేదు ఏకలవ్య గురుకుల పాఠశాలలో కలెక్టర్ సమగ్ర తనిఖీ**

**గుండాల ఏకలవ్య గురుకుల పాఠశాలలో జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ ఆకస్మిక తనిఖీ**

**నాగర్ కర్నూల్ సమయం ప్రతినిధి జూలై 17:** శుక్రవారం కల్వకుర్తి నియోజకవర్గం పరిధిలోని వెల్దండ మండలం గుండాల గ్రామ పరిధిలో ఉన్న తెలంగాణ ఏకలవ్య ఆదర్శ గురుకుల పాఠశాలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించి విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, విద్యా ప్రమాణాలు, మౌలిక వసతులను పరిశీలించారు. మొదట భోజనశాల, డైనింగ్ హాల్‌ను సందర్శించిన కలెక్టర్ విద్యార్థులకు అందిస్తున్న అల్పాహారం, మధ్యాహ్న భోజనం, రాత్రి భోజనం నాణ్యత, మెనూ అమలు, పరిశుభ్రత ప్రమాణాలను పరిశీలించారు. వంటశాలలో ఆహార పదార్థాల నిల్వ, తాగునీటి వినియోగం, వంట ప్రక్రియలను తనిఖీ చేసి నాణ్యమైన ఆహారం అందేలా నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని సిబ్బందికి సూచించారు. అనంతరం విద్యార్థుల డార్మిటరీలను పరిశీలించిన ఆయన పడకల ఏర్పాటు, గదుల పరిశుభ్రత, విద్యుత్ సౌకర్యాలు, మరుగుదొడ్లు, స్నానపు గదులు, తాగునీటి వసతి వంటి అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. తరగతి గదులను సందర్శించి బోధన తీరును పరిశీలించిన కలెక్టర్, ఉపాధ్యాయుల బోధనా విధానాలు, డిజిటల్ లెర్నింగ్ వినియోగం, విద్యార్థుల హాజరు తదితర అంశాలపై వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారు ఏ గ్రామాలు, ఏ మండలాల నుంచి వచ్చారో అడిగి తెలుసుకున్నారు. ఎక్కువ మంది విద్యార్థులు అచ్చంపేట, కల్వకుర్తి ప్రాంతాలతో పాటు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని గిరిజన గ్రామాలకు చెందినవారని తెలిపారు. విద్యార్థులకు వివిధ సబ్జెక్టులకు సంబంధించిన ప్రశ్నలు అడిగి వారి అభ్యాస స్థాయిని అంచనా వేసిన కలెక్టర్, సీబీఎస్ఈ సిలబస్‌కు అనుగుణంగా బోధన సమర్థవంతంగా కొనసాగాలని సూచించారు. భావనాత్మక అవగాహన, కమ్యూనికేషన్ నైపుణ్యాలు, పోటీ పరీక్షలకు అవసరమైన సామర్థ్యాల పెంపుపై ప్రత్యేక దృష్టి సారించాలని ఉపాధ్యాయులకు సూచించారు. అలాగే విద్యార్థుల్లో సృజనాత్మకత, విశ్లేషణాత్మక ఆలోచన, ఆత్మవిశ్వాసం పెంపొందేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు, సిబ్బంది తాగునీటి సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, వెంటనే స్పందించిన ఆయన పాఠశాల సమీపంలోని గుట్ట ప్రాంతాన్ని తొలగించి ప్రాంగణంలోనే బోరు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. సంబంధిత శాఖలతో సమన్వయం చేసి త్వరితగతిన బోరు తవ్వకాలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా విద్యుత్ సరఫరా, పారిశుధ్యం, వైద్య సేవలు, భద్రతా ఏర్పాట్లు, క్రీడా సామగ్రి, గ్రంథాలయం, కంప్యూటర్ ల్యాబ్ వినియోగం వంటి అంశాలపై కూడా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. విద్యార్థుల ఆరోగ్యం, విద్య, భద్రత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ మాట్లాడుతూ,...... గిరిజన విద్యార్థులకు అత్యున్నత స్థాయి విద్యను అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఏకలవ్య గురుకుల పాఠశాలలను నిర్వహిస్తోందని అన్నారు. ఈ విద్యాసంస్థల్లో చదువుతున్న ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్యతో పాటు ఉత్తమ వసతి, పౌష్టికాహారం, పరిశుభ్రమైన వాతావరణం, ఆధునిక మౌలిక సదుపాయాలు అందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, విద్యార్థులు చదువుతో పాటు క్రమశిక్షణ, వ్యక్తిత్వ వికాసం, నైతిక విలువలు పెంపొందించుకునేలా గురుకులాల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని, విద్యార్థుల సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి వెంటనే పరిష్కరించడం ప్రతి అధికారి బాధ్యత అని కలెక్టర్ స్పష్టం చేశారు. చిన్నచిన్న సమస్యలను కూడా నిర్లక్ష్యం చేయకుండా వెంటనే స్పందించాలని, ముఖ్యంగా తాగునీరు, విద్యుత్, పారిశుధ్యం, ఆహారం వంటి ప్రాథమిక అవసరాల విషయంలో ఎలాంటి లోపాలు ఉండరాదని, తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు. పాఠశాల అభివృద్ధికి అవసరమైన ప్రతిపాదనలను వెంటనే సిద్ధం చేసి జిల్లా యంత్రాంగానికి సమర్పించాలని అధికారులకు సూచించారు. జిల్లా కలెక్టర్ వెంట కల్వకుర్తి ఆర్డీఓ జనార్దన్ రెడ్డి,వెల్దండ తహశీల్దార్ కార్తిక్ కుమార్, యంఈఓ చంద్రుడు నాయక్, పాఠశాల ప్రిన్సిపల్,వివిధ శాఖల అధికారులు తదితరులు ఉన్నారు







## మక్తల్ సెట్విన్ శిక్షణ కేంద్రంలో మొదటి బ్యాచ్ తుది పరీక్షా కేంద్రాన్ని పరిశీలించిన మున్సిపల్ చైర్‌పర్సన్





మక్తల్ : మక్తల్ పట్టణంలోని సెట్విన్ టెక్నికల్ ట్రైనింగ్ ఇన్స్టిట్యూట్లో మొదటి బ్యాచ్‌కు సంబంధించిన తుది పరీక్షా కేంద్రాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీమతి వాకిటి మానస హనుమంతు సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా పరీక్షా నిర్వహణపై వివరాలు తెలుసుకుని, శిక్షణ పూర్తి చేసిన మహిళలను అభినందిస్తూ వారి భవిష్యత్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, కంప్యూటర్, మగ్గం వర్క్, బ్యూటీషియన్, టైలరింగ్ విభాగాల్లో మొత్తం 216 మంది మహిళలు 90 రోజుల నైపుణ్య శిక్షణను విజయవంతంగా పూర్తి చేశారని తెలిపారు. శిక్షణ అనంతరం నిర్వహించిన తుది పరీక్షలు మహిళలకు ఉపాధి అవకాశాలను మరింత మెరుగుపరుస్తాయని పేర్కొన్నారు. స్థానిక మంత్రివర్యులు డాక్టర్ వాకిటి శ్రీహరి గారి ప్రత్యేక చొరవతో మక్తల్‌లో సెట్విన్ శిక్షణ కేంద్రం ఏర్పాటు కావడం వల్ల మహిళలకు ఉచిత నైపుణ్య శిక్షణతో పాటు స్వయం ఉపాధి అవకాశాలు అందుబాటులోకి వచ్చాయని ఆమె అన్నారు. సెట్విన్ హైదరాబాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పరీక్షలు విజయవంతంగా పూర్తయ్యాయి. ఈ కార్యక్రమంలో సెట్విన్ హైదరాబాద్ చైర్మన్ గిరిధర్ రెడ్డి , మేనేజింగ్ డైరెక్టర్ ఎం. ఉపేందర్ రెడ్డి , మక్తల్ సెట్విన్ కోఆర్డినేటర్ ఎస్. విజయ్ కుమార్ , ఫ్యాకల్టీ సభ్యులు తిమ్మన్న , జి. స్వప్న, వీరమ్మ , ఫర్హానా బేగం, అలాగే చావీజ డైరెక్టర్ ఫయాజ్ తదితరులు పాల్గొన్నారు.

## మద్యం మత్తులో ఆటో నడిపిన డ్రైవర్‌కు 3 రోజుల జైలు

**డ్రంక్ అండ్ డ్రైవ్‌పై రాజీ లేదు.. తనిఖీలు నిరంతరం కొనసాగుతాయి: ట్రాఫిక్ పోలీసులు**

మహబూబ్‌నగర్, జూలై 17 (సమయం ప్రతినిధి): మద్యం సేవించి ఆటో నడిపిన ఓ డ్రైవర్‌కు న్యాయస్థానం మూడు రోజుల సాధారణ జైలు శిక్ష విధించింది. జిల్లా ఎస్పీ డి. జానకి, ఐపీఎస్ ఆదేశాల మేరకు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ కె. రాజేందర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో ఈ కేసు నమోదైంది.
తనిఖీల సందర్భంగా మద్యం మత్తులో ఆటో నడుపుతున్న డ్రైవర్‌ను పోలీసులు గుర్తించి కేసు నమోదు చేశారు. అనంతరం శుక్రవారం నిందితుడిని సెకండ్ క్లాస్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఆర్. శశిధర్ న్యాయస్థానంలో హాజరుపరచగా, విచారణ అనంతరం మూడు రోజుల సాధారణ జైలు శిక్ష విధించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కె. రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ, మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల డ్రైవర్‌తో పాటు ఇతర రహదారి వినియోగదారుల ప్రాణాలు కూడా ప్రమాదంలో పడతాయని అన్నారు. ముఖ్యంగా ఆటోలు, క్యాబ్‌లు, బస్సులు వంటి ప్రయాణికుల వాహనాలను మద్యం మత్తులో నడపడం అత్యంత నిర్లక్ష్యపూరితమైన, తీవ్రమైన నేరమని పేర్కొన్నారు. ప్రజల భద్రత దృష్ట్యా జిల్లాలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని, మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించి మద్యం సేవించిన తర్వాత వాహనాలు నడపవద్దని ట్రాఫిక్ పోలీసులు విజ్ఞప్తి చేశారు.



## అధికారులు బాధ్యతాయుతంగా వివరించారు: సిపిఎం

అమరచింత : వనపర్తి జిల్లా అమరచింత మండలం లోని పామిరెడ్డి పల్లి ఇందిరమ్మ ఇండ్ల బిల్లులకు 50వేలు లంచం ఇస్తేనే బిల్లులు చేయిస్తాము అని అంటే లబ్ధిదారులే నేరుగా మీడియా ఎదుట మాట్లాడారు మరియు మంత్రి వర్యులు వాకిటి శ్రీహరి ఒక్క రూపాయి లంచం తీసుకోకుండా ఇందిరమ్మ ఇండ్లు మంజూరు నుండి చివరి బిల్లు వరకు ఇప్పిస్తామని చెప్పిన కొంత మంది అధికారపార్టీ నాయకులు పల్లెల్లో వసూళ్లపర్వం లేనిదే ఇండ్లు మాంజురు బిల్లులు రావడం లేదనే విమర్శలు ఉన్నాయని సిపిఎం అనపర్తి జిల్లా కమిటీ సభ్యుడు అజయ్ విమర్శించారు. వీటిపై విజిలెన్స్ అధికారులు లబ్ధిదారులతో విచారణ చెప్పట్టే తీరు సరిగ్గా లేదు ఎవరి పై అయితే లంచం ఆరోపణలు వచ్చాయో అట్టి నాయకులను అధికారపార్టీ నేతలను వెంబడే పెట్టుకొని విజిలెన్స్ అధికారులు విచారించడం తప్పు అధికారులలే ఎవరికి చెప్పకుండా నేరుగా వ్యక్తిగతంగా విచారణ చేయాల్సింది పొయ్యి.. ప్రభుత్వవిజి లెన్స్ అధికారులు గా కాకుండా రాజకీయ నాయకులలాగా గుంపుల్లో బహిరంగ విచారణ చెయడం ఏమి పద్దతి. హౌసింగ్ అధికారులు డ.అధికారపార్టీ పై వచ్చిన లంచం ఆరోపణలు ను కప్పి పుచ్చే విదంగా వ్యవహరించిన తీరు అన్యాయం గా ఉంది. ఎ విచారణ అయిన సరే వ్యక్తి గతంగా గొప్యంగా విచారిస్తే బాగుండేది అధికారులు బాధ్యత యూతంగా వ్యవహారించాలి. యస్. అజయ్. సిపిఎం మండలకార్యదర్శి వర్గ సభ్యులు.

## ప్రైవేట్ స్కూల్ బస్ డ్రైవర్స్ కు సంక్షేమ బోర్డు ని ఏర్పాటు చేయాలి.

–టి యు సి ఐ జిల్లా అధ్యక్షులు ఎస్ కిరణ్



గద్వాల : శుక్రవారం నాడు ప్రగతిశీల ప్రైవేటు స్కూల్ బస్సు డ్రైవర్స్ యూనియన్ Reg no:- A-01/2016(అనుబంధం టి యు సి ఐ) జనరల్ బాడీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి రఘు అధ్యక్షత వహించగా టి యు సి ఐ జిల్లా అధ్యక్షులు ఎస్ కిరణ్ ప్రసంగిస్తూ ప్రైవేట్ స్కూల్ బస్సు డ్రైవర్ కు చట్ట ప్రకారం వేతనాలు ఇవ్వాలని కోరారు. సీట్ కెపాసిటీకి మించి విద్యార్థులని ఎక్కించిన బాధ్యత తోటి విద్యార్థులను పాఠశాలకు చేర్పించడంలో తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పనికి మించిన భారంతో మానసికంగా కృంగి కృషించిపోతున్నారన్నారు. ఫిట్నెస్ లేని బస్సులను ఇచ్చి డ్రైవర్స్ మీద నెట్టివేయడం దారుణం అన్నాడు. ప్రభుత్వాలు ప్రైవేట్ స్కూలు బస్సు డ్రైవర్స్ కి సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని బోర్డ్ ద్వారా ఇన్సూరెన్స్ తదితర సౌకర్యాలను కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్ స్కూల్ యాజమాన్యాలు డ్రైవర్స్ పట్ల దురుసుగా ప్రవర్తించడం మానుకోవాలన్నారు. చట్ట ప్రకారం తగిన వేతనాలు ఇచ్చి వారి గౌరవాన్ని కాపాడుకోవాలని గుర్తు చేశారు. స్కూల్ బస్సు డ్రైవర్స్ పైన అక్కడక్కడ దాడులు జరుగుతున్నాయని ఈ దాడులకు వ్యతిరేకంగా పోరాటం చేయాలని డ్రైవర్స్ కి పిలుపునిచ్చారు. ప్రైవేట్ స్కూల్ బస్సు డ్రైవర్ సందర్భంగా సంఘటితంగా పోరాడాలని అందుకోసం టియుసిఐ యూనియన్ ఎల్లవేళలా మీ వెంబడి ఉంటదని చెప్పారు.కార్యక్రమంలో ఇ రమేష్, రఘు, భీమయ్య, భాస్కర్ రెడ్డి,శివ, పరశురాం, అనిల్, వెంకట్ రెడ్డి , గోవింద్, సంజీవ్, రాజు, కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

## 9 రూపాయిలకు చేరిన కోడిగుడ్డు ధర

కాకినాడ : ఆంధ్రప్రదేశ్‌లో కోడి గుడ్డు ధర సామాన్యుడిపై గుదిబండలా మారింది. కోళ్ల ఫారాల వద్దే ఒక్కో కోడి గుడ్డు రూ. 6.95 పైసలతో రికార్డు స్థాయికి చేరుకుంది. ఇప్పటి వరకు ఇదే అత్యధిక ధర కావడం విశేషం. ఫారాల వద్ద రూ. 6.95 పైసలు ఉన్న కోడి గుడ్డు ధర రిటైల్ మార్కెట్‌లో రూ. 8.50 పైసలకు పైగానే పలుకుతుంది. గతేడాది ఇదే రోజున రూ. 4.90 పైసలు ఉండగా ఇప్పుడు డబుల్ అయింది.నిత్యావసర ధరలు రోజురోజుకూ పెరిగిపోతూనే ఉన్నాయి. తాజాగా కోడిగుడ్డు ధర కూడా ఆకాశాన్ని తాకింది. మిడిల్ క్లాస్ ఇళ్లల్లో నాన్ వెజ్‌కి ప్రత్యామ్నాయంగా ఉన్న గుడ్డు ధర చూసి ప్రజలు షాక్ అవుతున్నారు. కోళ్ల ఫారాల దగ్గరే రికార్డు స్థాయికి ధర చేరగా.. ఇక బయట మార్కెట్లలో ఏ రకంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

# చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయంలో బ్రిటిష్ రెసిడెన్సి పై దాడి సదస్సు

**స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలు నేటి తరానికి ఆదర్శప్రాయం**
**డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి**
**తెలంగాణ రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు**





హైదరాబాద్ : వీరనారి చాకలి ఐలమ్మ మహిళ విశ్వవిద్యాలయం చరిత్ర విభాగం ఆధ్వర్యంలో బ్రిటిష్ రెసిడెన్సి పై దాడి అనే అంశంపై శుక్రవారం దర్బార్ హాల్లో చరిత్రక సదస్సు ఘనంగా నిర్వహించారు. చరిత్ర సదస్సుకు విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొఫెసర్ సూర్య ధనంజయ్ అధ్యక్షతన నిర్వహించారు. చరిత్ర సదస్సుకు ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి హాజరై కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి మొదలుపెట్టారు. కార్యక్రమంలో భాగంగా చరిత్ర విభాగ విద్యార్థినులు ప్రదర్శించిన బ్రిటిష్ రెసిడెన్సి పై దాడి చారిత్రక నాటిక విశేషంగా ఆకట్టుకుంది. తుర్రె బాజ్ ఖాన్, మౌల్వి అల్లావుద్దీన్ నాయకత్వంలో జరిగిన వీరోచిత పోరాటాన్నివిద్యార్థినులు హృద్యంగా ఆవిష్కరించి ప్రేక్షకుల ప్రశంసలు అందుకున్నారు.మాజీ తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ సభ్యులు టి వివేక్ & డాక్టర్ పద్మ రచించిన "తెలంగాణ రాష్ట్ర ఉద్యమం- కల్లోల భరిత సంవత్సరాలు" గ్రంథాన్ని ఆవిష్కరించారు. చిన్నారెడ్డి మాట్లాడుతూ1857 తొలి స్వాతంత్ర సంఘం గ్రామంలో హైదరాబాద్ లోని బ్రిటిష్ రెసిడెన్సి పై జరిగిన చారిత్రక దాడిని స్మరించుకుంటూ ఈ కార్యక్రమానికి నిర్వహించడం నేటి తరానికి ఆదర్శప్రాయమని అన్నారు. బ్రిటిష్ రెసిడెన్సిపై జరిగిన దాడి తెలంగాణ చరిత్రలో ఒక స్ఫూర్తిదాయక ఘట్టమని పేర్కొన్నారు. చరిత్రను తెలుసుకోవడం అంటే మన మూలాలను తెలుసుకోవడమేనని అన్నారు.లివీరుల పోరాటాల వల్లే మనకు స్వేచ్ఛా వాతావరణం లభించిందని ,విద్యార్థులు చరిత్రను కేవలం పాఠ్యాంశంగా కాకుండా స్ఫూర్తిగా స్వీకరించాలని అన్నారు. స్వాతంత్ర్య ఉద్యమంలోమహిళల పాత్ర ఎంతో కీలకమైందని మహిళ స్వాతంత్ర సమరయోధుల గురించి వివరించారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ అమరవీరుల త్యాగాలు వచ్చే తరాలకు ఆదర్శంగా ఉండాలని ప్రముఖ విశ్వవిద్యాలయాలకు, కళాశాలలకు అమరవీరుల పేర్లు పెడుతూ గౌరవిస్తున్నారని తెలిపారు. వీర నారి చాకలి ఐలమ్మ పేరు మీద ఉన్న ఈ విశ్వవిద్యాలయం మహిళా సాధికారతకు ప్రతీక అని కొనియాడారు.చరిత్రలోని మహనీయుల జీవితాలు యువతకు మార్గదర్శకాలని ,విద్యతో పాటు విలువలు, దేశభక్తి కూడా విద్యార్థులకు అవసరమని తెలిపారు.స్వేచ్ఛ కోసం ప్రాణత్యాగం చేసిన అమర వీరులను ఎప్పటికీ మరువరాదని సూచించారు. దేశాభివృద్ధికి బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలని విద్యార్థులకు సూచించారు.లిచరిత్ర స్ఫూర్తితో సమాజాభివృద్ధి, దేశ ప్రగతి కోసం అందరం కలిసి ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో కెప్టెన్ డాక్టర్ ఎల్ పాండురంగారెడ్డి, ప్రొఫెసర్ సత్యనారాయణ, సురేందర్ రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రత్యేక ఓటరు సవరణలో పాల్గొన్న ఎంపీ డీకే అరుణ

## ప్రతి ఓటరు ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగస్వామి కావాలి: డీకే అరుణ

మహబూబ్‌నగర్, జూలై 17 (సమయం ప్రతినిధి): మహబూబ్‌నగర్ క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ప్రత్యేక ఓటరు సవరణ కార్యక్రమం (ఎస్ఐఆర్)లో బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు, మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె తన ఓటరు వివరాలను ఎన్యూమరేషన్ ఫారంలో స్వయంగా నింపి సంబంధిత అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా డీకే అరుణ మాట్లాడుతూ ప్రతి ఒక్క ఓటరు తప్పనిసరిగా ప్రత్యేక ఓటరు సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. చనిపోయిన వారి పేర్లను ఓటరు జాబితా నుంచి తొలగించడం, వేర్వేరు ప్రాంతాల్లో ఉన్న డబుల్ ఓట్లను గుర్తించి తొలగించే ప్రక్రియలో బీజేపీ కార్యకర్తలు చురుకుగా పాల్గొనాలని సూచించారు. అదేవిధంగా ప్రతి పోలింగ్ బూత్ వద్ద బీజేపీ ఆధ్వర్యంలో హెల్ప్ డెస్క్‌లను ఏర్పాటు చేసి, ప్రత్యేక ఓటరు సవరణ కార్యక్రమంలో ఓటర్లకు అవసరమైన సహాయాన్ని అందించాలని కార్యకర్తలకు ఆమె సూచించారు.

## జిల్లా ప్రధాన కార్యదర్శి పరశురాం నీ సన్మానించిన కుమ్మరి సంఘం నాయకులు



వనపర్తి. సమయం ప్రతినిధి. జులై 17: వనపర్తి జిల్లాలో కుమ్మరి సంఘం ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన సూర్యవంశం పరుశరాముని కుమ్మరి సంఘం నాయకులు ఘనంగా సన్మానించడం జరిగింది. వనపర్తి జిల్లాలో జిల్లా అధ్యక్షులు ప్రధాన కార్యదర్శి మరియు గౌరవ అధ్యక్షుల సహకారంతో కుమ్మరుల ఐక్యతను చాటి చెప్పాలి అదేవిధంగా వనపర్తిలో కుమ్మరి కుల సంఘం భవన నిర్మాణానికి పాటుపడాలి తెలంగాణ రాష్ట్రంలోని వనపర్తి జిల్లా ను ప్రథమంగా ఉంచాలని కుమ్మరి సంఘం నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో కే రాము సూర్యవంశం విష్ణు ఊరుకొండ ఆంజనేయులు సూర్యవంశం రాంబాబు సూర్యవంశం భాను తదితరులు పాల్గొన్నారు.

## సాఫ్ట్ వేర్ నుంచి సాగువైపు...

నిజామాబాద్ : నేటి తరం యువత చదువు పూర్తి కాగానే సాఫ్ట్‌వేర్ ఉద్యోగం సంపాదించాలనో.. లక్షలు ఖర్చు చేసి ఉన్నత చదువుల కోసం అమెరికా, లండన్ వంటి విదేశాలకు వెళ్లాలనో కలలు కంటుంది. కానీ.. తెలంగాణకు చెందిన ఒక సాధారణ రైతు బిడ్డ మాత్రం ఆ గ్లామరస్ ఐటీ ప్రపంచాన్ని, విదేశీ అవకాశాలను కాలదన్ని తాను పుట్టిన మట్టిలోనే వ్యాపార సామ్రాజ్యాన్ని నిర్మించింది. నిజామాబాద్ జిల్లా చింతలూరు గ్రామానికి చెందిన సంజనా రెడ్డి సరికొత్త అగ్రి ఎంట్రపెన్యూర్‌గా మారి నేడు దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకుంటోంది. ఆమె సక్సెస్ జర్నీ ప్రస్తుతం సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారడమే కాకుండా.. లక్షలాది మంది నెటిజన్ల ప్రశంసలు అందుకుంటోంది.సంజనా రెడ్డి ఇంజనీరింగ్ పూర్తి చేసిన తర్వాత మంచి ఐటీ కంపెనీలో ఉద్యోగం సంపాదించింది. కానీ ఆ ఉద్యోగంలో చేరలేదు. ఆ తర్వాత విదేశాలకు వెళ్లాలనే లక్ష్యంతో పరీక్షలు రాసి, మంచి స్కోర్‌తో అమెరికాలోని ప్రతిష్టాత్మక యూనివర్సిటీ ఆఫ్ సెంట్రల్ మిస్సోరీలో అడ్మిషన్ కూడా సాధించింది. అంతా సిద్ధమై అమెరికాకు పయనమయ్యే సమయంలో ఆమె తనను తాను ఓ ప్రశ్న వేసుకుంది. 'ఉన్నత చదువుల కోసం నా సొంత ఊరిని, దేశాన్ని విడిచి విదేశాలకు ఎందుకు వెళ్లాలి? నేను చదువుకున్న చదువును, టెక్నాలజీని ఇక్కడే నా కళ్ల ముందే ఉన్న సమస్యలను పరిష్కరించడానికి ఎందుకు ఉపయోగించకూడదు ?' అని ఆలోచించింది. తాను ఒక రైతు బిడ్డ కావడంతో చిన్నతనం నుండి రైతులు పడే కష్టాలను, నష్టాలను సంజన కళ్లారా చూసింది. నెలల తరబడి ఎండనక, వాననక కష్టపడి పంట పండిస్తున్నప్పటికీ దళారీల వల్ల, మార్కెట్ ఒడిదుడుకుల వల్ల రైతులకు కనీస మద్దతు ధర కూడా లభించడం లేదని గ్రహించింది. ఈ సమస్యకు టెక్నాలజీ, వ్యాపార ఆలోచనలతో చెక్ పెట్టాలని నిర్ణయించుకుంది. ఈ క్రమంలోనే తను రోజూ పొలంలో చేసే పనులను, వ్యవసాయ జీవన విధానాన్ని సోషల్ మీడియాలో పోస్ట్ చేయడం ప్రారంభించింది. అలా ఆమె పోస్ట్ చేసిన పసుపు సాగు గురించిన ఒక వీడియో సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అయ్యింది. ఆ వీడియో తెచ్చిన క్రేజ్‌తో ప్రజలు నేరుగా తమ పొలం నుంచే స్వచ్ఛమైన పసుపును కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపించారు.ఈ ఊహించని అవకాశాన్ని వ్యాపారంగా మార్చుకుంటూ ఆమె 'ఇందూరు ఫార్మ్స్' అనే ఈ-కామర్స్ స్టార్టప్‌ను ప్రారంభించింది. రైతుల నుంచి పంటను నేరుగా ఎటువంటి దళారీల ప్రమేయం లేకుండా మంచి ధరకు కొనుగోలు చేసి డిజిటల్ ప్లాట్‌ఫామ్స్ ద్వారా నేరుగా వినియోగదారులకు డెలివరీ చేయడం ప్రారంభించింది. నేడు ఈమె వ్యాపారం కేవలం తెలంగాణకే పరిమితం కాకుండా.. ఆంధ్రప్రదేశ్, బెంగళూరు, చెన్నై వంటి దేశంలోని ప్రధాన మెట్రో నగరాలకు విస్తరించింది.సంజన విజయగాథపై సోషల్ మీడియాలో నెటిజన్లు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. ఆమె ఎక్కడ పుట్టిందో.. ఆ మూలాల నుంచే ఎదగాలని నిర్ణయించుకోవడం అత్యంత స్ఫూర్తిదాయకమని అంటున్నారు. నిజమైన మార్పు ఎప్పుడూ మూలాల నుంచే మొదలవుతుందని.. గ్రామీణ నేపథ్యం నుంచి వచ్చి ఇంత పెద్ద వ్యాపారాన్ని నిర్మించడం అద్భుతమని, తాను జీవితాంతం చూసిన సమస్యకు టెక్నాలజీతో పరిష్కారం కనుగొన్న సంజన నిజమైన ఎంట్రప్రెన్యూర్ అని నెటిజన్లు కొనియాడుతున్నారు. రైతు కూతురిగా మొదలైన ఆమె ప్రయాణం.. నేడు వందలాది మంది రైతులకు దిక్సూచిగా మారిందని ప్రశంసిస్తున్నారు.

## డాక్టర్లను నియమించాలి - 50 పడకల ఆసుపత్రిని ఏర్పాటు చేయాలి

**సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.డి జబ్బర్**

సమయం ప్రతినిధి : భారత కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్టు సిపిఎం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శుక్రవారం రోజు పానగల్ మండల కమిటీ ఆధ్వర్యంలో విద్యా వైద్య రంగాలపై సర్వే నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ వనపర్తి జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎండి జబ్బర్ మాట్లాడుతూ,,, వనపర్తి జిల్లాలో అతిపెద్ద మండలం అయిన పానగల్ 28 గ్రామపంచాయతీలతో ఉందని జిల్లా కేంద్రానికి 14 కిలోమీటర్ల దూరంలో ఉన్న పాన్గల్ పీహెచ్సీ లో అనేకమైన సమస్యలు ఉన్నాయని అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు, ఈ హాస్పిటల్ గతంలో 24 గంటలు సర్వీస్ లో ఉండేదని ఇప్పుడు 12 గంటలు మాత్రమే పనిచేస్తుందని, నలుగురు డాక్టర్లు పనిచేయాల్సిన చోట ఒక్క డాక్టర్ కూడా లేకపోవడం అన్యాయం అన్నారు, ఇక్కడ గ్రామాలకు ఇన్చార్జిలుగా ఉన్న డాక్టర్లు రోజుకు ఒకరు చొప్పున పీహెచ్సీ దగ్గర ఉండాల్సి వస్తుందని అన్నారు, ఇక్కడ డాక్టర్ గా పని చేస్తున్న చంద్రశేఖర్ గారు డిప్యూటేషన్ మీద వేరే ప్రాంతానికి వెళ్లడం జరిగిందని, వారి ప్లేసులో వేరే డాక్టర్ను తీసుకురావడంలో అధికారులు మర్చిపోయారని అన్నారు, పీహెచ్సీ దగ్గర త్రాగటానికి మంచినీరు కరువైందని, పరిశుభ్రంగా లేదని అన్నారు, ఇక్కడ రోజుకు 150 నుండి 180 వరకు ఓపి చూసేవాళ్ళని ఇప్పుడు డాక్టర్లు లేక 30 40 మంది వచ్చే పరిస్థితి కూడా లేదని అన్నారు, కుక్క కాటుకు, తేలుకాటుకు పాము కాటుకు గురైన వాళ్ళు వనపర్తి వెళ్లాల్సి వస్తుందని అన్నారు, 45 రోజుల నుంచి ఈ హాస్పిటల్ లో ఇద్దరు మాత్రమే డెలివరీ కేసులు జరిగాయని అన్నారు, 28 గ్రామపంచాయతీలు ఉన్నచోట ఇంత పెద్ద మండలానికి ఒకే అంబులెన్స్ సరికాదని అన్నారు, ఇక్కడ రోగికి ఏమైనా అవసరం ఉన్న చోట టెస్టులు చేయించుకోవడం కోసం ప్రైవేటు సెంటర్లకు వెళ్లాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు, రాష్ట్ర మంత్రిగా ఉన్న జూపల్లి కృష్ణారావు గారి నియోజకవర్గమైన పాన్గల్ మండల పిహెచ్సి లో అనేక సమస్యలు ఉన్నాయని మంత్రిగారు స్పందించాలని, తక్షణమే ఈ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు, సమస్యలను పరిష్కారం చేయని యెడల అన్ని రాజకీయ పార్టీలను ప్రజలను కలుపుకొని ప్రభుత్వంపై పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమం చేస్తామని హెచ్చరించారు, అదేవిధంగా కస్తూర్బా గాంధీ పాఠశాలకు వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు, పాఠశాల చుట్టుపక్కల అపరిశుభ్రంగా ఉందని తక్షణమే శుభ్రం చేయాలని అధికారుల కు ఫోన్లో ద్వారా తెలియజేశారు, ఈ మండలంలో విద్య వైద్య రంగాలు అభివృద్ధి చెందాలని అభివృద్ధి చేయాలని అధికారులకు సూచించారు, ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి బాల్య నాయక్, సిపిఎం మండల నాయకులు రేగి చెట్టు నిరంజన్ సర్పంచ్, జంబులయ్య సర్పంచ్, జి వెంకటయ్య, సూర్యవంశం రాము, బాలు ఉప సర్పంచ్, గోపాల్ తదితరులు సర్వేలో పాల్గొన్నారు.

## 19 న తెలంగాణ అమరవీరుల స్థూపం ఆవిష్కరణ & మహనీయుల విగ్రహాల ఆవిష్కరణ ను విజయ వంతం చేయండి

**తెలంగాణ ఉద్యమ కారుల వెల్ఫేర్ అసోసియేషన్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు పి వెంకట్ రాంరెడ్డి**



రంగారెడ్డి : రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ మున్సిపాలిటీ ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆధ్వర్యంలో ఈనెల 19వ తేదీన ఆదివారం రోజు న ఉదయం 9 గంటలకు జరిగే తెలగాణ అమరవీరుల స్థూపం ఆవిష్కరణ కార్యక్రమం చేయాలి అని తెలంగాణ ఉద్యమ కారుల వెల్ఫేర్ అసోసియేషన్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు మాజీ జెడ్పీటీసీ సభ్యుడు పి వెంకట్ రాంరెడ్డి అన్నారు. ఈ సందర్భంగా షాద్‌నగర్ తెలంగాణ ఉద్యమ కారుల వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన తెలంగాణ ఉద్యమ కారుల సమావేశంలో ఆయన మాట్లాడారు.తెలంగాణ అమరవీరుల స్థూపం ఆవిష్కరణ ను , మహనీయుల విగ్రహాల ఆవిష్కరణ ను విజయ వంతం చేయండి చేయాలి అని వెంకట్ రాంరెడ్డి పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమం కు అన్ని పార్టీల కు చెందిన తెలంగాణ ఉద్యమకారు లు, విద్య వంతులు, మేధావులు, తెలంగాణ వాదులు,విద్యార్థులు, అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమ కారుల వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏ శ్రీనివాస్ రెడ్డి, నేతలు ఆర్ల యాదయ్య యాదవ్, రవి కుమార్ గౌడ్, గాదె సుధాకర్, మేకల వెంకటేష్,తెలంగాణ ఉద్యమ కారుల వెల్ఫేర్ అసోసియేషన్ కో కన్వీనర్ జాంగారి రవి, నేతలు కుడుముల మల్లేష్, సునీల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## అమరావతిలో ఎకరం 8 కోట్లా

న్యూఢిల్లీ : అమరావతి రాజధాని భూముల విలువ సరికొత్త రికార్డు సృష్టించింది. స్టార్ హోటళ్ల కోసం ఎకరానికి రూ. 8.20 కోట్ల ధరను సీఆర్డీఏ నిర్ణయించింది. అమరావతిలో ఇప్పటి వరకు ప్రభుత్వ భూముల కేటాయింపుల్లో ఇదే అత్యధిక ధర. అదే సమయంలో ప్రైవేట్ స్కూళ్ల కోసం ఎకరానికి రూ. 4.10 కోట్ల ధరతో ఐదు స్టార్ హోటళ్లు, ఐదు ప్రైవేట్ పాఠశాలల ఏర్పాటుకు టెండర్లు ఆహ్వానించింది. అమరావతిలో రాజధాని నిర్మాణం వేగం పుంజుకుంటున్న వేళ సీఆర్డీఏ తీసుకున్న ఈ కీలక నిర్ణయం.. అమరావతి నగరానికి మరో మైలురాయిగా నిలిచిపోనుంది. అయితే, అమరావతిలో ఇప్పటివరకూ కేటాయించిన భూముల్లో ఇదే అత్యధిక రేటు.. స్టార్ హోటళ్లకు 9.19 ఎకరాలు.. ప్రైవేట్ స్కూళ్లకు 15.80 ఎకరాల భూమిని అఖీఆం కేటాయించింది. స్కూల్ నిర్మాణం కోసం 33ఏళ్ల పాటు భూమిని లీజుకు తీసుకోవచ్చు. ఇక.. హోటల్ నిర్మాణానికి కేటాయించిన భూమి.. ఎకరానికి రూ. 8.20 కోట్ల ధర నిర్ణయించింది అఖీఆం..రాజధానిలో మూడు త్రీ స్టార్, రెండు ఫోర్ స్టార్ హోటళ్లు ఏర్పాటు చేయనున్నారు. హోటల్ భూములను ఫ్రీహోల్డ్ పద్ధతిలో కేటాయిస్తారు. హోటల్ ఏర్పాటు చేయాలంటే కనీసం రూ. 75 కోట్ల పెట్టుబడి తప్పనిసరి. ప్రతి హోటల్‌లో కనీసం 125 గదులు ఉండాలి. ప్రతి గది 5 స్టార్ ప్రమాణాలకు అనుగుణంగా ఉండాలి. ప్రతి హోటల్ భవనంపై హెలిప్యాడ్ ఏర్పాటు చేయడం తప్పనిసరి. హోటల్ నిర్వహణకు కనీసం 175 మంది సిబ్బంది ఉండాలి. కన్వెన్షన్, బ్యాంకెట్ హాళ్లు ఏర్పాటు చేసి ఏడాదికి కనీసం 2,500 మందికి ఉపాధి కల్పించేలా ప్రణాళిక ఉండాలని సీఆర్డీఏ షరతు విధించింది.హోటళ్లను నిర్మించే సంస్థలు సీఆర్డీఏకు ప్రత్యేక సౌకర్యాలు కూడా కల్పించాలి. ప్రతి ఏడాది 15 రోజుల పాటు గదులను సీఆర్డీఏ వినియోగానికి ఉచితంగా అందుబాటులో ఉంచాలి. ప్రభుత్వ సమావేశాలు, సదస్సుల కోసం బ్యాంకెట్ హాలును కూడా ఏడాదికి 15 రోజుల పాటు ఉచితంగా ఇవ్వాలి. ఏడాది లోపు బ్యాంకు గ్యారంటీ సమర్పించడంతో పాటు, నిర్ణీత గడువులో నిర్మాణాలు పూర్తి చేయాలి. ఒప్పంద నిబంధనలు ఉల్లంఘిస్తే జరిమానాలు, బ్యాంకు గ్యారంటీ జప్తు వంటి చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందని టెండర్లలో స్పష్టం చేసింది.రాజధానిలో నాణ్యమైన విద్యా సంస్థలను ప్రోత్సహించేందుకు ఐదు ప్రైవేట్ స్కూళ్ల ఏర్పాటుకు 15.80 ఎకరాల భూమిని కేటాయించింది. ఎల్‌కేజీ నుంచి ప్లస్-2 వరకు విద్య అందించే పాఠశాలలు ఏర్పాటు చేయాలని టెండర్లలో పేర్కొంది. స్కూళ్లకు ఎకరానికి రూ. 4.10 కోట్ల ధర నిర్ణయించి, 33 ఏళ్ల లీజు ప్రాతిపదికన భూములు కేటాయించనుంది. తుళ్లూరు, నవులూరు, పెనుమాక, కృష్ణాయపాలెం, దొండపాడు ప్రాంతాల్లో ఈ స్కూళ్లు ఏర్పాటు కానున్నాయి.రాజధానికి తరలివస్తున్న ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు, న్యాయవ్యవస్థ సిబ్బంది, దేశీయ-విదేశీ పెట్టుబడిదారులు, కన్సల్టెంట్ల అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఈ హోటళ్లు, విద్యాసంస్థలకు సీఆర్డీఏ ప్రాధాన్యం ఇస్తోంది. ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలతో అమరావతిని అంతర్జాతీయ ప్రమాణాల రాజధానిగా తీర్చిదిద్దే దిశగా ఈ టెండర్లు మరో కీలక ముందడుగుగా భావిస్తున్నారు.




ఈ మధ్య శ్రీలీల తెలుగు సినిమాలు చేయడం లేదంటూ వార్తలు వైరల్ అవుతున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం ఆమె ఫోకస్ మొత్తం బాలీవుడ్, కోలీవుడ్ పైనే ఉందని.. అందుకే హైదరాబాద్‌లో కూడా ఉండటం లేదంటూ ఈ మధ్య తెగ ప్రచారం నడుస్తోంది. ఇలా ప్రచారం చేస్తున్న వారందరికీ షాక్ ఇస్తూ.. తాజాగా శ్రీలీల హైదరాబాద్‌లో మెరిసింది. అయితే, ఆమె హైదరాబాద్‌లో సందడి చేసింది సినిమా షూటింగ్ నిమిత్తం కాదు.. 'ది సిగ్నేచర్ సిల్క్స్' నూతన షోరూమ్ లాంచ్ కోసం ఆమె హైదరాబాద్‌లో ప్రత్యక్షమైంది. అత్యుత్తమ సిల్క్ చీరలు, డిజైనర్ ఎథ్నిక్ వేర్, బ్రైడల్ కలెక్షన్స్, పండుగల ప్రత్యేక వస్త్రాలకు ప్రీమియం గమ్యస్థానంగా నిలిచే 'ది సిగ్నేచర్ సిల్క్స్' తన నూతన షోరూమ్‌ను మెట్రో పిల్లర్ నెం. 741, హైదరాబాద్ కెపిహెచ్‌బిలో శ్రీలీల చేతుల మీదుగా ఆవిష్కరించింది. ఈ కార్యక్రమంలో ఫ్యాషన్ అభిమానులు, శ్రేయోభిలాషులు, శ్రీలీల అభిమానులు పెద్ద ఎత్తున హాజరై సందడి చేశారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో డైరెక్టర్ ప్రకాశ్ సింగ్ గెహ్లాట్, మేనేజింగ్ డైరెక్టర్ నరేందర్ సింగ్ గెహ్లాట్ పాల్గొని అతిథులను ఆహ్వానించారు. సంప్రదాయ, ఆధునిక శైలుల సమ్మేళనంతో అత్యుత్తమ నాణ్యత కలిగిన వస్త్రాలను వినియోగదారులకు ఒకే వేదికపై అందించాలనేది తమ లక్ష్యమని ఈ సందర్భంగా వారు వివరించారు.

ఈ కార్యక్రమంలో శ్రీలీల మాట్లాడుతూ.. ది సిగ్నేచర్ సిల్క్స్ యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలియజేశారు. షోరూమ్‌లో అందుబాటులో ఉన్న అద్భుతమైన సిల్క్ చీరలు, బ్రైడల్, డిజైనర్ కలెక్షన్లను ప్రశంసించారు. హైదరాబాద్‌లో సిల్క్ చీరలు, వివాహ వేడుకల దుస్తులు, పండుగల ప్రత్యేక వస్త్రాల కొనుగోలుకు ఈ షోరూమ్ ప్రముఖ గమ్యస్థానంగా ఎదగాలని ఆమె ఆకాంక్షించారు. ప్రస్తుతం ఈ షోరూమ్ లాంఛ్‌కు సంబంధించిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

ఇక రీసెంట్‌గా వచ్చి సక్సెస్ అయిన 'లెనిన్' చిత్రంలో మొదట శ్రీలీలనే హీరోయిన్. అనూహ్యంగా ఆమె తప్పుకోవడంతో భాగ్యశ్రీ ఆ రోల్‌కి ఎంపికయ్యారు. దీంతో ఈ సినిమా శ్రీలీల మిస్ చేసుకుని మంచి ఛాన్స్ పోగొట్టుకుందంటూ కొందరు కామెంట్స్ చేస్తున్నారు. ఇదిలా ఉంటే.. ఈ షోరూమ్ లాంచ్ వేడుకలో శ్రీలీల సరికొత్తగా కనిపించి.. అందరినీ అలరించింది. తన అందాలను, యాక్టింగ్‌ను మెరుగుపరుచుకునే క్రమంలో ఆమె ఉన్నట్లుగా, ఈ వేడుకలో ఆమెని చూసిన వారంతా అనుకుంటూ ఉండటం విశేషం.




అన్నపూర్ణ స్టూడియోస్ బ్యానర్ నుంచి తాజాగా ఓ ప్రీ లుక్ పోస్టర్ రాగానే అంతా, 'కింగ్ 100' సినిమా అప్డేట్ అని అనుకున్నారు. టైటిల్ టీజర్ అంటూ అనౌన్స్‌మెంట్ చేయగానే.. ఇంకేముంది 'కింగ్ 100' సినిమా టైటిల్ తెలిసిపోతుందని అంతా వార్తలు కుమ్మేశారు. అలా వార్తలతో హోరెత్తించిన వారందరినీ కింగ్ నాగ్ బురిడీ కొట్టించారు. అసలు విషయం ఏమిటంటే.. ఈ అప్డేట్ 'కింగ్ 100'వ సినిమాకు సంబంధించినది కాదు. అన్నపూర్ణ స్టూడియోస్, ఎపిక్ స్టూడియోస్ సంయుక్తంగా నిర్మిస్తున్న వినూత్న చిత్రానికి 'పళ్ళబురుసు' అనే చిత్రానికి సంబంధించిన మ్యాటర్. అవును తాజాగా ఈ మూవీకి టైటిల్‌ని ఖరారు చేస్తూ ఫస్ట్ లుక్‌ని మేకర్స్ విడుదల చేశారు.

ఈ సందర్భంగా విడుదల చేసిన ఫస్ట్ లుక్ పోస్టర్ ప్రేక్షకుల దృష్టిని ఆకర్షిస్తోంది. మరో 'బలగం' తరహా చిత్రమిదనే ఫీల్‌ని ఈ టైటిల్ గ్లింప్స్ ఇస్తోంది. ఈ చిత్రాన్ని 2026 ఆగస్టు 14న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. ఈ సందర్భంగా విడుదల చేసిన ఫస్ట్ లుక్ పోస్టర్ సినిమాపై ఆసక్తిని మరింత పెంచుతోంది. తెలుగు సంస్కృతి, ప్రాంతీయతను ప్రతిబింబించే ఈ చిత్రం వినోదభరితమైన కామెడీ-డ్రామాగా ప్రేక్షకుల ముందుకు రానుందని తెలుస్తోంది.

ఇందులో సుధాకర్ రెడ్డి, మురళీధర్ గౌడ్ తండ్రీకొడుకులుగా ప్రధాన పాత్రల్లో నటిస్తుండగా.. ప్రజ్వల్ , గోమతి రెడ్డి, కిరణ్ మాచా కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఫస్ట్ లుక్ పోస్టర్‌లో జిల్లా కోర్టు ఆవరణలో పెద్ద టూత్‌బ్రష్‌ను త్రాసులా రూపొందించి, దానిపై వెన్ను వెన్నుకు ఆనుకుని కూర్చున్న ఇద్దరు ప్రధాన పాత్రధారులను చూపించడం ఆకట్టుకుంటోంది. ఈ వినూత్న విజువల్ సినిమా కథపై ఆసక్తిని రేకెత్తిస్తూ ప్రేక్షకుల్లో క్యూరియాసిటీని పెంచుతోంది. ఈ చిత్రానికి ఉదయ్ చౌహాన్ కథ, దర్శకత్వం వహిస్తున్నారు. వినూత్న కాన్సెప్ట్, ఆకట్టుకునే ఫస్ట్ లుక్‌తో ఇప్పటికే ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించిన 'పళ్ళబురుసు' నుంచి త్వరలోనే మరిన్ని ఆసక్తికరమైన అప్డేట్స్‌ను విడుదల చేస్తామని ఈ సందర్భంగా మేకర్స్ తెలిపారు.




సినీ ప్రియులను భయపెడుతూనే ఎంతగానో అలరించిన బాలీవుడ్ పాపులర్ హారర్ ఫ్రాంచైజీ 'రాగిణి' మళ్లీ ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఈ సిరీస్‌లో వస్తున్న తాజా చిత్రం 'రాగిణి 3' లో స్టార్ బ్యూటీ తమన్నా భాటియా ప్రధాన పాత్ర పోషిస్తోంది. ఈ చిత్రానికి సంబంధించిన రెగ్యులర్ షూటింగ్ లండన్‌లో అధికారికంగా ప్రారంభమైంది. ప్రముఖ దర్శకుడు శశాంక ఘోష్ తెరకెక్కిస్తున్న ఈ ల్యాండ్‌మార్క్ హారర్ థ్రిల్లర్‌ను థియేటర్లలో భారీ స్థాయిలో విడుదల చేయడానికి మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. ఈ క్రమంలోనే 2027లో ఈ సినిమాను ప్రపంచవ్యాప్తంగా థియేట్రికల్ రిలీజ్ చేయనున్నట్లు చిత్రయూనిట్ ఇప్పటికే అధికారికంగా ప్రకటించింది. సుదీర్ఘ విరామం తర్వాత ఈ సక్సెస్‌ఫుల్ ఫ్రాంచైజీ మళ్లీ వెండితెరపైకి వస్తుండటంతో సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. హారర్ అంశాలకు గ్లామర్‌ను జోడించి ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని అందించడంలో 'రాగిణి' సిరీస్‌కు ఒక ప్రత్యేకమైన గుర్తింపు ఉంది. ఇప్పుడు వస్తున్న మూడో భాగంలో తమన్నా క్యారెక్టర్ సినిమాకే ప్రధాన ఆకర్షణగా నిలవనుందని మేకర్స్ చెబుతున్నారు. తన కెరీర్‌లోనే అత్యంత బోల్డ్, గ్లామరస్ అండ్ పవర్‌ఫుల్ పాత్రలో తమన్నా ఈ చిత్రంలో కనిపించబోతోంది. లండన్ పరిసరాల్లో జరిగే ఫస్ట్ షెడ్యూల్‌లో ఆమెకు సంబంధించిన కీలకమైన సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. ఈ సినిమాలో స్టార్ కిడ్ జునైద్ ఖాన్ ఒక కీలక పాత్రలో నటిస్తుండటం విశేషం. చిత్రంలో నటించే ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలను రాబోయే రోజుల్లో ఒక్కొక్కటిగా వెల్లడిస్తామని చిత్ర బృందం స్పష్టం చేసింది.

Cinema




యువ సామ్రాట్ అక్కినేని నాగ చైతన్య నటిస్తోన్న అత్యంత ప్రతిష్టాత్మక చిత్రం 'వృషకర్మ' . ఈ చిత్రం ట్రేడ్ వర్గాల్లో సరికొత్త రికార్డులు సృష్టిస్తోంది. నాగ చైతన్య తన కెరీర్‌లోనే అత్యంత ప్రతిష్టాత్మకంగా భావిస్తోన్న ఈ ప్రాజెక్ట్ కోసం.. గత ఏడాదిన్నర కాలంగా పూర్తి సమయాన్ని కేటాయించారు. 'విరూపాక్ష' ఫేమ్ కార్తీక్ దండు దర్శకత్వంలో తెరకెక్కుతోన్న ఈ మిస్టిక్ అడ్వెంచర్ థ్రిల్లర్ ప్రస్తుతం చిత్రీకరణ ముగింపు దశకు చేరుకుంది. సినిమాపై ఇండస్ట్రీలో భారీ అంచనాలు ఉండటంతో, షూటింగ్ పూర్తి కాకముందే మేకర్స్ కీలకమైన బిజినెస్ డీల్స్‌ను క్లోజ్ చేస్తున్నారు. ఈ క్రమంలోనే ప్రముఖ నిర్మాణ సంస్థ అయిన జీ గ్రూప్ ఈ సినిమాకు సంబంధించిన టోటల్ నాన్-థియేట్రికల్ హక్కులను భారీ ధరకు సొంతం చేసుకున్నట్లుగా తెలుస్తోంది. ఈ చిత్ర డిజిటల్, శాటిలైట్ హక్కులతో కూడిన పూర్తి నాన్-థియేట్రికల్ డీల్ సుమారు రూ. 50 కోట్లకు క్లోజ్ అయినట్లు సమాచారం. నాగ చైతన్య సినీ కెరీర్‌లోనే ఇది అత్యంత భారీ, రికార్డు స్థాయి నాన్-థియేట్రికల్ డీల్ కావడం విశేషం. సినిమా సబ్జెక్ట్‌లోని వైవిధ్యం, కమర్షియల్ ఎలిమెంట్స్, యూనిక్ కంటెంట్‌పై ఉన్న నమ్మకంతోనే జీ గ్రూప్ ఇంత పెద్ద మొత్తాన్ని వెచ్చించి హక్కులను దక్కించుకుందని ట్రేడ్ విశ్లేషకులు చెబుతున్నారు. ఈ భారీ డీల్‌తో సినిమా బిజినెస్ వర్గాల్లో సరికొత్త చర్చలు మొదలయ్యాయి. శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర బ్యానర్‌పై ప్రముఖ నిర్మాత బి.వి.ఎస్.ఎన్ ప్రసాద్ అత్యంత భారీ బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని నిర్మిస్తుండగా, బాపినీడు సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ఈ మిస్టిక్ థ్రిల్లర్‌లో నాగ చైతన్య సరసన మోస్ట్ హ్యాపెనింగ్ బ్యూటీ మీనాక్షి చౌదరి కథానాయికగా నటిస్తోంది. సరికొత్త కాంబినేషన్, వైవిధ్యమైన కథాంశంతో రూపొందుతోన్న 'వృషకర్మ' థియేట్రికల్ బిజినెస్ లోనూ మరిన్ని అద్భుతాలు సృష్టిస్తుందని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఈ క్రేజీ ప్రాజెక్ట్‌కు సంబంధించిన మరిన్ని వివరాలు త్వరలోనే అధికారికంగా వెల్లడి కానున్నాయి.




OWNED, PRINTED AND PUBLISHED BY KARNAM BHASKAR RAO, PRINTED AT SHREYA SREE PRINTERS, H.NO.1-3-129, RAJENDRA NAGAR, MAHABUBNAGAR DIST., T.S. PUBLISHED AT SREEJA SREE PUBLICATONS, H.NO.1-3-129, RAJENDRA NAGAR, MAHABUBNAGAR DIST, T.S, RNI NO: APTEL/2012/47246 EDITOR : KARNAM BHASKAR RAO, Ph: 08542-222814, Cell: 9848997085